ప్రతిపక్షం

www.prathipaksham.in

గురువారం 06.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 226 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

ప్రధానిని కలిసిన భారత మహిళల జట్టు 12

తొలి దశకు బిహార్ రెడీ

121 నియోజకవర్గాలలో నేడు పోలింగ్

- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు
- బరిలో 1,314 మంది అభ్యర్థులు
- రంగంలో ఉన్న 16 మంది మంత్రులు
- సకల ఏర్పాట్లు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- నితీశ్ కుమార్ పాలనకు కీలకం ఈ ఎన్నికలు
- హోరాహోరీగా సాగిన ఇరు కూటముల ప్రచారం
- ఓటు వేయనున్న 3.75 కోట్ల మంది బిహారీలు
- తొలిసారి మీట నొక్కనున్న 10.72 లక్షల మంది

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

పాట్నా, నవంబర్ 5: బీహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ గురువారం జరుగనుంది. ఇందుకు ఈసీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. 18 జిల్లాల పరిధిలోని 121 నియోజకవర్గాల్లో ఓటింగ్ జరగనుంది. 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పలువురు ప్రముఖ నేతల భవితవ్యం కూడా ఈ దశలోనే తేలనుంది. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగియడంతో అందరి దృష్టి ఇప్పుడు పోలింగ్ మీదనే ఉంది. ముఖ్యంగా హోరాహోరీ పోరు నెలకొన్న కీలక నియోజకవర్గాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కేబినెట్‌లోని 16 మంది మంత్రులు ఈ దశలో పోటీ పడుతున్నారు. వీరిలో 11 మంది బీజేపీ వారు కాగా, ఐదుగురు జేడీ(యు) మంత్రులు ఉన్నారు. ఈ ఎన్నికలు నితీశ్ ప్రభుత్వ పాలన, విశ్వసనీయతకు, అగ్నిపరీక్షగా మారాయంటున్నారు. అటు ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఆయన సోదరుడు, జనశక్తి జనతాదళ్ అధినేత తేజ్ ప్రతాప్ యాదవ్ కూడా గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ముంగేర్ జిల్లా తారాపూర్ నుంచి పోటీలో ఉన్నారు. ఇక్కడ ఆర్జేడీ అభ్యర్థిగా అరుణ్ కుమార్ షా, జన్ సురాజ్,

..:: మిగతా 2లో

కాంగ్రెస్ అంటేనే కరెంట్

- కరెంట్ అంటేనే కాంగ్రెస్
- ఉండదన్నవారు ముట్టుకుంటే తెలుస్తుంది
- తెలంగాణ రైజింగ్ ను ఏ ప్రతిపక్షం ఆపలేదు
- డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 5: కాంగ్రెస్ అంటేనే కరెంటు అని, కరెంటు అంటేనే కాంగ్రెస్ అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం

..:: మిగతా 2లో

కాంగ్రెస్ తోనే ముస్లింలకు మేలు

అనేక పదవులు ఇచ్చింది మన పార్టీనే

నా వ్యాఖ్యలను కొందరు వక్రీకరించారు

అజారుద్దీన్ కు మంత్రి పదవి ఎలా ఇచ్చారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడుగుతున్నారని, మరి, ఎందుకు ఇవ్వొద్దు? అదేమన్నా అయన అబ్బ జాగీరా! అని సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇస్తే కిషన్ రెడ్డికి ఏం ఇబ్బందో చెప్పాలన్నారు. మోడీ, కేసీఆర్ ఒక్కటేనన్నారు. జూబ్లీ హిల్స్ లో కేసీఆర్, మోడీ ఒక వైపు, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మరో వైపు ఉన్నారన్నారు. కేసీఆర్ ప్రతిసారి కేంద్రంలో మోడీకి మద్దతు ఇచ్చారన్నారు. ఇక్కడ లో బీఆర్ఎస్ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ ముస్లింలను మోసం చేస్తోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్లు దోచుకున్న కేసీఆర్ పైన సీబీఐ విచారణ అడిగితే మోడీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

- నేను తొలి నుంచి కూడా సెక్యులర్ వాదినే
- అజార్ మంత్రి పదవిపై కిషన్ రెడ్డికి మంట!
- ప్రజాస్వామ్య రక్షణ కాంగ్రెస్ తోనే సాధ్యం
- మోడీ, కేసీఆర్ ఒక్కటై కుట్రలు పన్నుతున్నారు
- నాడు అభివృద్ధి పేరిట కొందరికి మాత్రమే లాభాలు
- 20 నెలల ప్రజాపాలనలో అనేక పథకాలు తెచ్చాం
- దాదాపు 60 వేల ఉద్యోగాలను కూడా భర్తీ చేశాం
- సినిమా కార్మికుల పిల్లల కోసం ప్రత్యేక స్కూలు
- జూబ్లీహిల్స్ ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 5 : కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడే మైనార్టీ లకు అనేక అవకాశాలు కల్పించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రహమత్ నగర్ లో తాను మంగళవారం మాట్లాడిన మాటలను కొందరు వక్రీకరించారని ఆరోపించారు. తాను మొదటి నుంచి సెక్యులర్ వాదినని స్పష్టం చేశారు. షేక్ పేట డివిజన్ పారా మౌంట్ కాలనీ కార్నర్ మీటింగులో సీఎం రేవంత్ రెడ్డి బుధవారం ప్రసంగించారు. మంత్రులు వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, కాంగ్రెస్ నేత ఫహీం ఖురేషి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎంఐఎం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి, యువనేత నీలం మధు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భారీగా ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసపుచ్చిందని

..:: మిగతా 2లో

స్థానిక ఎన్నికలలో ట్రంప్‌కు ఎదురు దెబ్బ

అమెరికాలో తాజాగా జరిగిన స్థానిక ఎన్నికలలో డెమొక్రట్ పార్టీకి ఘన విజయం లభించింది. వర్జీనియా, న్యూజెర్సీ గవర్నర్ ఎన్నికలు, న్యూయార్క్ సిటీ మేయర్ రేసు సహా ముఖ్యమైన పోటీలలో డెమొక్రట్లు స్వీప్ చేశారు.

11

తుది దశకు చేరిన బిహార్ పోల్ సీన్

బిహార్ తొలిదశ ఎన్నికలు గురువారం జరుగనున్నాయి. ప్రలోభాల పంపిణీ వేగం పుంజుకుంది. పార్టీ నేతలు వస్తువులు, మద్యం, నగదుతో ఆగకుండా మాదకద్రవ్యాలు పంపిణీకి కూడా దిగారు.

11

ఓటు చోరీ ద్వారా గెలిచేందుకు ఎన్డీయే యత్నాలు

బిహార్‌లో ఓటు చోరీ ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఎన్డీయే కోరుకుంటోందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఆరోపించారు. ఎన్డీయే 20 యేండ్ల పాలనపై ప్రజలు విసుగుచెందారని వారికి అర్థమైందన్నారు.

11

రాష్ట్రవ్యాప్తంగా 'కార్తీక' వెలుగులు

- ఊరూరా ఘనంగా సాగిన వేడుకలు
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- ఆలయాలలో సత్యదేవుడి 'వ్రతాలు'
- కిటకిటలాడిన వేములవాడ, కీసరగుట్ట
- గడ్డి అన్నారం, యాదగిరిగుట్టలో పూజలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 5: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం కార్తిక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పౌర్ణమి సందర్భంగా సత్యానారాయణ స్వామి దేవాలయాలలో భక్తులు కిటకిటలాడారు. దిల్ సుఖ్ నగర్ గడ్డి అన్నారం క్షేత్రంలో ఉదయం నుంచి రాత్రి వరకు సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్న వితరణ కొనసాగించారు. రాష్ట్రవ్యాప్తంగా భక్తులు నదీ తీరాలలో

..:: మిగతా 2లో

వేములవాడలో కార్తీక శోభ

ఎవరేం చేశారో తేల్చుకుందాం!

- చర్చకు రావడానికి సీఎం సిద్ధమా!
- మా హయంలోనే నగరం విశేష అభివృద్ధి
- లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించాం
- మీరు హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చారు
- కాంగ్రెస్ నేతలు అన్నీ అబద్ధాలు చెబుతున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

చిటుకుల మైసారెడ్డి, ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 5: మన మహా నగరంలో ఎవరెంత అభివృద్ధి చేశారో దమ్ముంటే చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. జూబ్లీహిల్స్‌లో ఓడిపోతామనే ఫ్రస్టేషన్ తోనే రేవంత్ రెడ్డి ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి ఆయన భాషలో ఆయనకు అర్థమైయేటట్లు చెప్పే సత్తా తమకు ఉందని అన్నారు. కానీ, రేవంత్ రెడ్డి తమను తిట్టినా, తాము మాత్రం గౌరవంగానే మాట్లాడుతామని స్పష్టం చేశారు. గత పదేండ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో రెండేండ్లలో రేవంత్ ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. దీంతో చెత్త ఎవరిది. సత్తా ఎవరిదో తేలిపోతుందని అన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం బీఆర్ఎస్ హయాంలో చేసిన అంశాలను కేటీఆర్ ప్రస్తావించారు. 'హైదరాబాద్‌లో 42 ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించాం. మా హయాంలో స్టార్ట్ చేసినవాటికే కాంగ్రెస్ రిబ్బన్ కట్ చేసింది. అవి కాకుండా,

..:: మిగతా 2లో

డిమాండ్లు పరిష్కరించే వరకు బంద్

- తేల్చిచెప్పిన ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య
- బకాయిలలో 50 శాతమన్నా చెల్లించాలి
- కమిషనర్ దేవసేన తమను బెదిరిస్తున్నారు
- ప్రైవేట్‌విద్యా సంస్థల సమాఖ్య అధ్యక్షుడు రమేశ్ బాబు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 5: తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు బంద్ కొనసాగిస్తామని తెలంగాణ ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య అధ్యక్షుడు రమేశ్‌బాబు తేల్చి చెప్పారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం తమను చర్చలకు పిలిచిందని చెప్పారు. జేఎన్‌టీయూ, ఉస్మానియా యూనివర్సిటీల పరిధిలో నిర్వహిస్తున్న పరీక్షలను కళాశాలలు బహిష్కరించాయని, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కమిషనర్ దేవసేన ఐఏఎస్ ఎంత వేధిస్తున్నా భరిస్తున్నామని తెలంగాణ ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య పేర్కొంది. ఆమెను వెంటనే విద్యాశాఖ నుంచి బదిలీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు. 'ప్రభుత్వం ఐదారు సంవత్సరాల నుంచి ప్రైవేటు కాలేజీలకు బకాయిలను పే చేయకుండా ఇతర అన్నీ సంస్థలకు చెల్లిస్తుంది. ఇవన్నీ చూసిన మేము గత్యంతరం లేక రోడ్డు బాట పట్టాల్సిన పరిస్థితి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్నీ కాలేజీలు ఏకమై ఫతి అనే ఫెడరేషన్‌ను ఏర్పర్చుకోవడం జరిగింది. ఫీజు రియింబర్స్‌మెంట్ లో ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.10 వేల కోట్లలో వెంటనే 50 శాతం వెంటనే చెల్లించాలి' రమేశ్‌బాబు పేర్కొన్నారు. 10 వేల కోట్ల బకాయిలలో కనీసం 50 శాతం విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. బకాయిలను విడతల వారీగా పది నెలలలో చెల్లించాలన్నారు. అన్ని కళాశాలల అధ్యాపకులను హైదరాబాద్ తీసుకువస్తామని, ఈ నెల 11 లేదా 12న విద్యార్థులతో సభ జరుపుతామని చెప్పింది. ప్రభుత్వం స్పందించకపోతే బంద్ ఇలానే కొనసాగుతుందని తేల్చి చెప్పింది.

పంజాబ్ లో మరో కబడ్డీ ప్లేయర్ హత్య

పంజాబ్ రాష్ట్రంలోని లూధియానాలో కబడ్డీ ఆటగాడు గుర్విందర్ సింగ్‌ను (23) గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. సోమవారం రాత్రి నలుగురు దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు.

11

రాజకీయం

'సమగ్ర సవరణ'ను సమర్థిస్తున్నారా? లేదా?

- రాహుల్ గాంధీ ఆరోపణలకు ఈసీ ప్రతి సవాల్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 5: ఓట్ల చోరీ అంశంపై 'హైడ్రోజన్ బాంబు' పేరిట కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించగా, కేంద్ర ఎన్నికల సంఘం దానికి దీటుగా ప్రతిస్పందించింది. హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని, బ్రెజిల్ మోడల్‌కు కూడా ఇక్కడ ఓటు ఉందని ఆరోపించారు. ఈ ఆరోపణలపై ఈసీ స్పందించింది. రాహుల్ గాంధీ ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను సమర్థిస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా? చెప్పాలని ప్రశ్నించింది. నిరుడు హర్యానాలో ఎన్నికలు జరిగాయని, వాటికి ముందు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని తెలిపింది. పోలింగ్ స్టేషన్‌లలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించింది.

కేసీఆర్, హరీశ్ రావు అరెస్టు తరువాత!
ముందు ఆరు గ్యారంటీల సంగతి చూడండి

- సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి ప్రతి సవాల్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు అరెస్టు సంగతి పక్కన పెట్టి, ముందుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు మీద చర్చకు రావాలని డిమాండ్ చేశారు. అనవసర ఆరోపణలు చేయడం మానుకుని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన డిక్లరేషన్లు, 420 హామీలపై చర్చకు సిద్ధమా? కాళేశ్వరం కేసుపై విచారణ జరిపిస్తామని మేం ఎన్నికలలో హామీ ఇవ్వలేదు. ముందు మీరిచ్చిన హామీల గురించి మాట్లాడండి. ఆ తర్వాత మిగతా విషయాలు చర్చిద్దాం' అని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉందని, అందుకే కాళేశ్వరం కేసులో కేసీఆర్, హరీశ్‌రావును సీబీఐ అరెస్ట్ చేయడం లేదని సీఎం ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నెల 11వ తేదీలోగా వారిద్దరినీ సీబీఐతో అరెస్ట్ చేయించి బీజేపీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు.

6 లేన్లుగా హైదరాబాద్ – విజయవాడ హైవే

- భూసేకరణకు కేంద్రం నోటిఫికేషన్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5: హైదరాబాద్ - విజయవాడ ఈ రహదారి ఇప్పుడు ఆరు లేన్లుగా మారనుంది. 65వ జాతీయ రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. 269 కిమీ ఉన్న మొత్తం రహదారిలో 229 కి.మీను నాలుగు వరసల నుంచి ఆరు లేన్లకు విస్తరించేలా భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల చేసింది. భూసేకరణకు సంబంధించి తెలంగాణ, ఏపీలో అధికారులను నియమిస్తున్నట్లు ఆ నోటిఫికేషన్‌లో కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఇందులో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తొమ్మిది, నల్గొండ జిల్లా చిట్యాలలో ఐదు, నార్కట్‌పల్లిలో ఐదు, కట్టంగూర్‌లో నాలుగు, నకిరేకల్‌లో రెండు, కేతేపల్లిలో నాలుగు గ్రామాలు, సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట మండలంలో నాలుగు, చివ్వెంలలో ఆరు, కోదాడ మండలంలో నాలుగు, మునగాల మండలంలోని ఐదు గ్రామాలలో భూసేకరణ బాధ్యతలను ఆర్డీఓలకు అప్పగించారు. ఇక ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ మండలంలో నాలుగు గ్రామాలు, కంచికచర్లలో నాలుగు, జగ్గయ్యపేటలో ఏడు, పెనుగంచిప్రోలులో మూడు, ఇబ్రహీంపట్నంలో పన్నెండు, విజయవాడ రూరల్‌లో ఒకటి, విజయవాడ వెస్ట్‌లో రెండు, విజయవాడ నార్త్‌లోని ఒక గ్రామంలో భూసేకరణ బాధ్యతలను జాయింట్ కలెక్టర్లకు అప్పగించారు.

చేవెళ్ల బస్ ప్రమాదానికి సర్కారే కారణం

- బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్ రెడ్డి ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5: చేవెళ్ల సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో పలువురు మృతి చెందడం పట్ల బీఆర్ఎస్ రాష్ట్ర నేత పటోళ్ల కార్తీక్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. దారుణ ఘటనలో ప్రభుత్వ వైఫల్యంపై మండిపడ్డారు. బీజాపూర్ జాతీయ రహదారి 2021లో మంజూరు అయినప్పటికీ, ఎన్జీటీ స్టే కారణంగా పనులు నిలిచిపోయాయని తెలిపారు. స్టే ఉపసంహరించేందుకు రెండు సంవత్సరాలుగా ప్రభుత్వాన్ని కోరుతున్నామని, ప్రాజెక్ట్ డైరెక్టర్ నివేదిక ఇవ్వకుండా కాలయాపన చేశారన్నారు. ఎన్జీటీకి ప్రపోజల్స్ సమర్పించి ఉంటే అప్పటికే పనులు ప్రారంభమయ్యేవన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి షార్ట్ టర్మ్ మెమరీ లాస్ ఉందని విమర్శించారు. చనిపోయినవారి కుటుంబాలు రోదిస్తుంటే కొందరు రాజకీయాలు మాట్లాడుతున్నారని, వారికి ఇంగిత జ్ఞానం ఉందా? అని ప్రశ్నించారు. బీజేపీని ప్రజలు నమ్మకపోవటానికి కొండా విశ్వేశ్వర్ రెడ్డి లాంటి వాళ్లే కారణమని అన్నారు. రోడ్డు పనులు వెంటనే ప్రారంభించకపోతే తాండూరు, వికారాబాద్ నుంచి పాదయాత్రగా వచ్చి సెక్రెటేరియట్ ను ముట్టడిస్తామని తెలిపారు.

జూబ్లీహిల్స్ ను పట్టించుకోని కిషన్ రెడ్డి

- ఏం మొఖం పెట్టుకొని ఓట్లడుగుతున్నారు
- టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5: ఆరు గ్యారెంటీల అమలు గురించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా రహమత్ నగర్ లో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. అసెంబ్లీ ఎన్నికలపుడు ప్రజలకిచ్చిన వాగ్దానాలను రేవంత్ సర్కారు ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే, కిషన్ రెడ్డి కళ్లుండీ చూడలేని కబోదిగా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పదకొండేండ్లుగా అధికారంలో ఉన్న కిషన్ రెడ్డి తన ఎంపీ పరిధిలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఏపాటి నిధులు తెచ్చారో, ఈ మురికివాడల సాక్షిగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి మళ్లీ ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడగడానికి వచ్చారో చెప్పాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రతి పేదవాడి బ్యాంకు అకౌంటులో 15 లక్షల రూపాయలు వేస్తామని చెప్పి మోసం చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా జూబ్లీహిల్స్ పేదలకు చేసిందేమీ లేదని బండి సుధాకర్ అన్నారు.

కాంగ్రెస్ తోనే ముస్లింలకు మేలు

మొదటిపేజీ తరువాయి

తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ అభివృద్ధి పేరు మీద కేవలం కొందరి వ్యక్తిగత లాభాలకే పాలన పరిమితమైందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడి, నిజమైన అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని సీఎం అన్నారు. మైనార్టీలకు కాంగ్రెస్ అనేక పెద్ద పదవులు ఇచ్చిందని గుర్తు చేశారు. 'కాంగ్రెస్ అంటే ముస్లిం-ముస్లిం అంటే కాంగ్రెస్' అని స్పష్టం చేశారు. అటు కొడంగల్ లో తాను మూడు సార్లు గెలవడానికి మైనార్టీల సహకారం ఎంతో ఉందన్నారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో మైనార్టీ లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశామని చెప్పారు.

అదేమన్నా అయన అబ్బ జాగీరా!

అజారుద్దీన్ కు మంత్రి పదవి ఎలా ఇచ్చారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడుగుతున్నారని, మరి, ఎందుకు ఇవ్వొద్దు? అదేమన్నా అయన అబ్బ జాగీరా! అని సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇస్తే కిషన్ రెడ్డికి ఏం ఇబ్బందో చెప్పాలన్నారు. మోడీ, కేసీఆర్ ఒక్కటేనన్నారు. జూబ్లీ హిల్స్ లో కేసీఆర్, మోడీ ఒక వైపు, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మరో వైపు ఉన్నారన్నారు. కేసీఆర్ ప్రతిసారి కేంద్రంలో మోడీకి మద్దతు ఇచ్చారన్నారు. ఇక్కడ లో బీఆర్ఎస్ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ ముస్లింలను మోసం చేస్తోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్లు దోచుకున్న కేసీఆర్ పైన సీబీఐ విచారణ అడిగితే మోడీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్ రేస్ కేసు లో కేటీఆర్ అరెస్ట్ కోసం గవర్నర్ అనుమతించడం లేదన్నారు. దేశంలో ఈడీ, ఐటీ, సీబీఐ పేరుతో పలువురిని వేధిస్తున్న మోడీ కేసీఆర్, కేటిఆర్ విషయం లో మాత్రం పర్మిషన్ ఇవ్వడం లేదని విమర్శించారు. బీజేపీలో బీఆర్ఎస్ ను విలీనం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కిషన్ రెడ్డికి దమ్ముంటే జూబ్లీ హిల్స్ లో డిపాజిట్ తెచ్చుకోవాలని సీఎం సవాల్ విసిరారు. తమ ప్రభుత్వం జూబ్లీహిల్స్ లో మూడు నెలలో 400 కోట్ల అభివృద్ధి పనులను చేపట్టిందని వివరించారు. నవీన్ యాదవ్ ని గెలిపిస్తే నియోజవర్గం మరింతగా అభివృద్ధి జరుగుతుందన్నారు.

సినిమా కార్మికులకు ఆరోగ్య బీమా

యూసుఫ్ గూడాలో కార్నర్ మీటింగులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ సినిమా కార్మికులకు ఆరోగ్య బీమా కల్పిస్తామని, సినిమా కార్మికుల పిల్లల కోసం ఒక స్కూల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. మహిళకు ఉచిత బస్ సౌకర్యం కల్పించామన్నారు. మహిళా సంఘాలకు వెయ్యి కోట్ల భూమి ఇచ్చి వాళ్ల ఉత్పత్తులు అమ్ముకునే అవకాశం కల్పించామని, 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. బీజేపీ, బీఆర్ ఎస్ ఒక్కటై కాంగ్రెస్ ను ఓడించడానికి కుట్రలు చేస్తున్నారన్నారు. ఇటు నవీన్ యాదవ్ విజయం సాధిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. నవీన్ యాదవ్ కి 30 వేల మెజార్టీ ఇవ్వాలని ఓటర్లను కోరారు.

తొలి దశకు బిహార్ రెడీ

మొదటిపేజీ తరువాయి

జన్ తంత్రిక్ జనతాదళ్ అభ్యర్థులు కూడా బరిలో ఉండటంతో చతుర్ముఖ పోరు నెలకొంది. వైశాలి జిల్లా రాఘోపూర్, తేజస్వి యాదవ్ కుటుంబానికి కంచుకోటగా ఉంది. ఇక్కడ ఆయన ఎన్డీయే అభ్యర్థి సతీశ్ యాదవ్‌ను ఢీకొంటున్నారు. పాట్నా రూరల్ పరిధిలోని మొకామా స్థానం, దులార్‌చంద్ యాదవ్ హత్య కేసు నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక్కడ జేడీ(యు) నుంచి అనంత్ సింగ్, ఆర్జేడీ నుంచి వీణాదేవి పోటీలో ఉన్నారు. ఇద్దరూ బలమైన రాజకీయ కుటుంబాలకు చెందినవారు కావడంతో పోరు రసవత్తరంగా మారింది.

కళారంగానికి చెందిన ప్రముఖులు

కళారంగానికి చెందిన ప్రముఖులు కూడా బరిలో నిలిచారు. ప్రముఖ జానపద గాయని మైథిలి ఠాకూర్‌ను బీజేపీ దర్భంగా జిల్లాలోని అలీనగర్ నుంచి నిలిపింది. ఆమెకు పోటీగా ఆర్జేడీ నుంచి వినోద్ మిశ్రా ఉన్నారు. భోజ్‌పురి సూపర్ స్టార్ కేసరి లాల్ యాదవ్ సారన్ జిల్లాలోని ఛాప్రా నుంచి ఆర్జేడీ తరపున పోటీ చేస్తున్నారు. లఖిసరాయ్‌లో ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా కాంగ్రెస్ అభ్యర్థితో తలపడుతున్నారు. బేగుసరాయ్‌లో బీజేపీ అభ్యర్థి కుందన్ కుమార్‌కు, కాంగ్రెస్‌కు చెందిన అమితా భూషణ్‌కు మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇక్కడ కుల సమీకరణాలు కీలకం కానున్నాయి. పాట్నాలోని పట్టణ నియోజకవర్గమైన బకీపూర్‌లో బీజేపీ నేత నితిన్ నబిన్ మరోసారి పోటీ చేస్తున్నారు.

బిహార్ తొలి విడత సమరానికి

బిహార్ తొలి విడత సమరానికి కేంద్ర ఎన్నికల సంఘం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. బిహార్ లో 243 నియోజకవర్గాలు ఉండగా 18 జిల్లాల పరిధిలోని 121 స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6గంటలకు ముగియనుంది. పలు భద్రతా కారణాలతో సిమ్రి బఖ్తియార్‌పూర్, మహిషి, తారాపూర్, ముంగర్, జమల్‌పూర్, సూర్యగర్హా నియోజకవర్గంలోని 56 పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ సాయంత్రం 5 గంటలకే ముగియనుంది. 3.75కోట్ల మంది బిహారీలు అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. 45,341పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసారు. 10.72లక్షల మంది తొలిసారి ఓటు వేయనున్నారు. తొలి విడతలో జేడీయూ 57 స్థానాలలో, బీజేపీ నుంచి 48 మంది, ఎల్జేపీ తరపున 14 మంది, ఆర్ఎల్ఎం తరపున ఇద్దరు బరిలో ఉన్నారు. మహా ఘట్ బంధన్‌కు సంబంధించి ఆర్జేడీ 73 చోట్ల పోటీలో ఉండగా, కాంగ్రెస్ నుంచి 24 మంది, సీపీఐ (ఎంఎల్) తరఫున 14 మంది రంగంలో ఉన్నారు. తొలిసారి బిహార్ ఎన్నికల బరిలో దిగిన ప్రశాంత్ కిశోర్ సారథ్యంలోని జన్‌సు రాజ్ పార్టీ నుంచి 119 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

కీసర గుట్టలో..

గడ్డి అన్నారంలో...

షాద్ నగర్ లో ఉసిరి చెట్టు కింద భోజనాలు

రాష్ట్రవ్యాప్తంగా 'కార్తీక' వెలుగులు

మొదటిపేజీ తరువాయి

పుణ్యస్నానాలు ఆచరించి దీపాలను వదిలారు. శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. పలువురు భద్రాచలం వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. ఆలయాలలో కార్తిక దీపాలు వెలిగించారు. దీంతో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ప్రత్యేకంగా మహిళలు ఆలయ పరిసరాలలో కార్తీక దీపాలను వెలిగించి, 365 వత్తులతో కూడిన దీపాలను సమర్పించారు. గడ్డి అన్నారం శ్రీ వీర వెంకట సత్యానారాయణ స్వామి క్షేత్రంలో 1200 సామూహిక వ్రతాలు జరిగాయి. ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు సామూహిక వ్రతాలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ దేవరం లింగయ్య, ప్రధాన కార్యదర్శి చకిలం రమణయ్య, కోశాధికారి వక్కలంక శ్రీనివాసరావు ఏర్పాట్లు చేశారు.

కీసరగుట్టలో కార్తిక పౌర్ణమి వేడుకలు

సుప్రసిద్ధ శైవ క్షేత్రం కీసరగుట్టలో భక్తుల సందడి నెలకొంది. శ్రీరామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. దర్శన అనంతరం భక్తులు ఆలయానికి ఎదురుగా ఉన్న శివలింగాలకు పంచామృత అభిషేకాలు చేశారు. ఆలయ పరిసరాలలో కార్తీక దీపాలు వెలిగించారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. యాదగిరిగుట్టలో కార్తిక పౌర్ణమి సందడి నెలకొంది. భక్తులు సత్యదేవుడికి పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి రోజున షాద్ నగర్ పట్టణంలోని తిరుమల మెఘా టౌన్ షిప్ కు చెందిన కొంతమంది మహిళలు ఉసిరిచెట్టు కింద భోజనాలు నిర్వహించారు. కాలనీకి చెందిన మహిళలు, పురుషులు పాల్గొని సరదాగా భోజనం ఆరగించారు.

కాంగ్రెస్ అంటేనే కరెంట్

మొదటిపేజీ తరువాయి

ఆయన పరిగి నియోజకవర్గంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదన్న వారు కరెంటుతో పాటు కాంగ్రెస్ ను ముట్టుకుంటే తెలుస్తుందని చురకలంటించారు. రాష్ట్రంలో 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తును 53 లక్షల కుటుంబాలకు అందజేస్తున్నామన్నారు. వికారాబాద్ జిల్లాలో 2 లక్షల 47 వేల 777 కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి 42 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ శాఖకు చెల్లిస్తుందన్నారు. ప్రతి నెల గృహజ్యోతి పథకం కోసం 2,830 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ శాఖకు చెల్లిస్తుందని తెలిపారు. పరిగిలో 1000 కోట్లతో విద్యుత్ అభివృద్ధి పనులను మంజూరు చేశామన్నారు. 9 సబ్ స్టేషన్ లతోపాటు 33/11 కెవి, 400 కేవీ సబ్ స్టేషన్, 220 కెవి సబ్ స్టేషన్ ను మంజూరు చేశామన్నారు పరిగి నియోజకవర్గం అభివృద్ధి కోసం రామ్మోహన్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నాడు అన్నారు. నా వెల్ ప్రాజెక్టుకు సంబంధించిన మూడు వేల కోట్ల సాధన కోసం ఆయన ఎంతగానో కృషి చేశారని, అయితే గత ప్రభుత్వం 10 సంవత్సరాల పాటు పట్టించుకోలేదన్నారు. డిఫెన్స్ కు సంబంధించి 3000 కోట్లు రావడం ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో పరిగి నియోజకవర్గం లో పారిశ్రామిక రంగం అభివృద్ధి కోసం విద్యుత్తు సబ్ స్టేషన్ లు పెద్ద ఎత్తున మంజూరు చేశామని వాటికి భూమి పూజ కూడా చేశామన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఆయా కుటుంబాలను తమ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోనే మన్నెగూడ నుంచి బీజాపూర్ వరకు రోడ్డు మంజూరు అయిందని, అయితే గతం పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం రోడ్డు వేయకుండా నిర్లక్ష్యం చేసింది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్జీటీ 2 లో ఉన్న కేసును గత నెల 30న తొలగించడం కోసం కృషి చేయడం వల్ల నాలుగు లైన్ల రహదారి పనులు వడివడిగా నడుస్తున్నాయన్నారు. కొద్దిమంది ప్రతి పక్ష నాయకులు కాంగ్రెస్ వల్ల పేదలకు నష్టం జరిగిందని అంటున్నారని, పదేళ్లలో అప్పటి ప్రభుత్వం చేసిన పనుల గురించి చెబితే, ఏ ఒక్క పని కాలేదు అన్నది స్పష్టమవుతుందన్నారు. గత ప్రభుత్వ మూడెకరాల భూమి ఇంటికో ఉద్యోగం, బంగారు తెలంగాణ చేస్తామని చెప్పిందని అందులో ఒక్కటైనా అమలైందా అని ప్రశ్నించారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా ప్రాజెక్టు కడతామని చెప్పి మోసం చేసిందని, కృష్ణనదిపై ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదని, గోదావరిపై లక్ష కోట్ల రూపాయలతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు సంగతి ఏమైందో ప్రజలందరికి తెలుసు అన్నారు . యూపీఏ ప్రభుత్వ హయాంలో వంద రోజులు ఉపాధి పనులను మాత్రమే గత ప్రభుత్వం గ్రామాలలో చేపట్టినప్పుడు అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు కొబ్బరికాయలు కొట్టి ఫోటోలు దిగారని, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు చేసే పనిని వాళ్ళు చేశారని ఎద్దేవా చేశారు.

ఎవరేం చేశారో తేల్చుకుందాం!

మొదటిపేజీ తరువాయి

కొత్తగా ఈ రెండేండ్లలో ఒక్క రోడ్డు అయినా నిర్మించారా' అని కేటీఆర్ ప్రశ్నించారు. కొత్త రోడ్ల సంగతి తర్వాత, కనీసం రోడ్లపై పడిన గుంతలైనా పూడ్చారా అని నిలదీశారు. నగర ప్రజలకు మళ్లీ వాటర్ ట్యాంకర్‌లపై ఆధారపడే పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని మీద కాంగ్రెస్ నేతలు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

శానిటేషన్ సమస్య పరిష్కారానికి

హైదరాబాద్‌లో శానిటేషన్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ కూడా సీఎంగా ఒక ఏరియాను ఎంచుకొని అక్కడ శానిటేషన్ పనులు పర్యవేక్షించారని గుర్తు చేశారు. స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి.. వేలాది స్వచ్ఛ ఆటోలను ప్రవేశపెట్టామని అన్నారు. ఇప్పుడు కనీసం ఒక్క ఆటోనైనా ప్రవేశపెట్టారా అని ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. తమ హయాంలో ప్రతి రోజు 7.5 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించామని వెల్లడించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 34 అవార్డులు సాధించామని తెలిపారు. బెస్ట్ క్వాలిటీలో నెంబర్ వన్ సిటీగా హైదరాబాద్‌కు అవార్డు వచ్చిందని చెప్పారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడే SNDPని కూడా స్టార్ట్ చేసినట్లు తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ హైదరాబాద్‌ను క్లీన్‌సిటీగా మారిస్తే.. ఇప్పుడు దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మురికికూపంగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు

పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్క హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించిదని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ రెండేండ్లలో ఒక్క ఇల్లైనా కట్టారా అని ప్రశ్నించారు. దమ్ముంటే దీనిపై చర్చకు రావాలని చాలెంజ్ చేశారు. వేలాది ఇళ్లను హైడ్రా పేరుతో కూలగొట్టారని ఫైరయ్యారు. హైదరాబాద్ మెట్రో పూర్తి చేసింది కూడా తమ ప్రభుత్వమేనని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మెట్రో సీఎఫ్‌వో, ఎల్ అండ్ టీ సీఎఫ్‌వోలను బెదిరిస్తోందన్నారు. కాంగ్రెస్ బాధ తట్టుకోలేక, వాళ్ల బెదిరింపులకు తాళలేక ఎంత మంది పారిశ్రామికవేత్తలు పారిపోయారో చర్చకు సిద్ధమా అని నిలదీశారు. సైబరాబాద్‌లో 41 శాతం, హైదరాబాద్‌లో 60 శాతం క్రైమ్ రేటు పెరిగిందని వెల్లడించారు. పచ్చి అబద్ధాలు చెబుతున్న కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ నెల 11న కారు గుర్తుకు ఓటేసి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పది సంవత్సరాల హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి తాలూకు ప్రగతి నివేదికను కేటీఆర విడుదల చేశారు.

"
ఉన్నత విద్య పాఠ్యప్రణాళికను ప్రక్షాళన చేయాల్సిన అవసరముంది. ప్రభుత్వ వర్సిటీల్లో పరిపాలనకు సంబంధించి యూనిఫైడ్ యాక్ట్ రూపొందించాలని ఆదేశించాం. ఐటీఐలు, వర్సిటీలను నవంబర్ లోగా పరిశ్రమలతో అనుసంధానించాలి. విద్యార్థుల వంద శాతం క్యాంపస్ సెలక్షన్స్‌కు చర్యలు తీసుకోవాలి. ఇంటర్‌లో ఉత్తీర్ణత పెంపునకు చర్యలు చేపట్టాలి.

- ఏపీ మంత్రి నారా లోకేశ్

పదేండ్లలో మీరు ముస్లింలకు ఏం చేశారు?

- రెండేండ్ల పాలనలో మేమేం చేశామో చెబుతాం
- బీఆర్ఎస్ నేతలు జవాబు చెబుతారా?
- కాంగ్రెస్‌నేత షబ్బీర్ అలీ, మంత్రి అజారుద్దీన్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5 : కేసీఆర్, కేటీఆర్ పదేండ్లలో ముస్లింల కోసం ఏమి చేశారో చెప్పాలని ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. మంత్రి అజారుద్దీన్ తో కలిసి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేండ్లలో ఏం చేశారో చెబితే, కాంగ్రెస్ పార్టీ రెండేండ్లలో ఏం చేశామో చెబుతా అటూ షబ్బీర్ సవాల్ చేశారు. ముస్లింలు , దళితుల కోసం నేడు వారు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టులో న్యాయం కోసం వెళ్తే కేసీఆర్ ఏ సమయంలో కూడా సహాయం అందించలేదని దుయ్యబట్టారు. కనీసం ప్రభుత్వం తరపున అడ్వకేట్ కూడా నియమించలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ముస్లింలు అభివృద్ధి కోసం నిలబడుతుంటే బీఆర్ఎస్ పార్టీ విమర్శలు చేయడంపై మండిపడ్డారు. తెలంగాణ లో పలు విద్యాసంస్థలను కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ఎక్కడ కూడా హిందువులు, ముస్లింలు అనే భేదం చూపించడం లేదన్నారు. రేషన్ కార్డులు ఇచ్చిందని, ఉర్దూ టీచర్ల పోస్టులు ఇచ్చిందని చెప్పారు. ముస్లింలు కోసం తెలంగాణ లో ఒక్క కాలేజీ అయిన కట్టారా? అంటూ ప్రశ్నించారు. తెలంగాణ మెడికల్ కాలేజీలలో 1,248 మంది ముస్లిం విద్యార్థులు చదువుతున్నారని, 682 మంది ఫ్రీ సీట్లు పొందారని వివరించారు. కాగా, ముస్లిం సోదరులు నవీన్ యాదవ్ కు మద్దతు తెలిపి అత్యధిక మెజారిటీ గెలిపించాలని కోరారు. శాఖల కేటాయింపులతో సంతృప్తిగా ఉన్నానని మంత్రి అజారుద్దీన్ తెలిపారు.

ఓటు వేసేందుకు 12 గుర్తింపు కార్డులు ఇవే

- జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ ప్రకటన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5 : ఓటరు జాబితలో పేరుండి, ఓటరు గుర్తింపు కార్డు కాకుండా 12 ప్రత్యామ్నాయ ఫొటో ఐడీలలో ఏదైనా ఒకటి పోలింగ్ సిబ్బందికి చూపి జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. ఆధార్, ఉపాధిహామీ జాబ్ కార్డు, బ్యాంకు, తపాల కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ బుక్, కేంద్ర కార్మిక శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు లేదా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ కింద రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్ పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ పత్రాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, అటు పీఎస్ యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజేబుల్ గుర్తింపు కార్డు (యూడీఐడీ)లు కలిగి ఉండాలనీ జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు.

సుదర్శన్ రెడ్డిని కలిసిన టీపీసీసీ చీఫ్

- బాధ్యతలు స్వీకరించిన ప్రధాన సలహాదారు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5 : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని సెక్రెటేరియట్‌లోని ఆయన కార్యాలయంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి తదితరులు బుధవారం నాడు మర్యాద పూర్వకంగా కలిసారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టుల మృతి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బీజాపూర్ (ఛత్తీస్ గఢ్), నవంబర్ 5 : ఛత్తీస్‌గఢ్ - తెలంగాణ సరిహద్దు బీజాపూర్ జిల్లాలో బుధవారం భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పులలో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారని తెలిసింది. తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం, మారిమల్ల అడవులలో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఆ ప్రాంతంలోని మావోయిస్టులను భద్రతా దళాలు చుట్టుముట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే భద్రతా దళాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎదురు కాల్పులలో ముగ్గురు మావోయిస్టులు హతమైనట్లు సమాచారం. భద్రతా దళాలు సంఘటనా స్థలంనుంచి పెద్ద సంఖ్యలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఇంకా అదే ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. అయితే, మావోయిస్టుల మృతిపై పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

గంజాయి బ్యాచ్ ఆగడాలు

- పోలీసుల వింత సమాధానాలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5 : రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రబొడ కాలనీలో గంజాయి గ్యాంగ్ రెచ్చిపోయింది. పార్క్ చేసిన కార్ అద్దాలు ధ్వంసం చేసి హంగామా చేసింది. ఈ విషయమై ప్రశ్నించిన యజమానితో దురుసుగా ప్రవర్తించింది. 'మాకు పగలగొట్టాలని అనిపించింది, అందుకే పగలగొట్టాం' అంటూ దురుసుగా సమాధానం ఇచ్చిన ఆ బ్యాచ్, అవసరమైతే కారు మొత్తం తగలబెడతామంటూ బెదిరింపులకు పాల్పడింది. అడ్డు వచ్చినవారిపై దాడులకు పాల్పడుతూ హల్‌చల్ చేసింది. దీంతో గంజాయి బ్యాచ్ ఆగడాలపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫిర్యాదు చేస్తేనే వస్తామని సీఐ వింత సమాధానం ఇవ్వడంతో ఎర్రబొడవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులు నమోదు కాకుండా లీడర్లు సముదాయిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఎర్రబొడలో బీరప్ప గుడి మెట్లపై కొందరు వ్యక్తులు మద్యం సేవించి బీర్ బాటిల్స్ అక్కడే పడేస్తున్నారని ఆరోపించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలోఒక గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. పలువురు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించింది. గంజాయి బ్యాచ్ వెకిలి సైగలతో మహిళలు ఆవేదనకు గురైన పరిస్థితులు ఉన్నాయి. ఇప్పుడు సమాచారం అందించినా స్పందించపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బైకుపై మంత్రి 'పొన్నం' ప్రభాకర్ ప్రచారం

- సన్న బియ్యం లబ్ధిదారు ఇంటిలో భోజనం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5 : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్ గూడా డివిజన్ శ్రీ కృష్ణ నగర్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ లోని వెంకటగిరి వాటర్, కృష్ణానగర్ బి బ్లాక్, యూసుఫ్ గూడ చెక్ పోస్ట్ వరకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, శివసేనారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఒక్కో ఓటరు తో ఆప్యాయంగా మాట్లాడుతూ నవీన్ యాదవ్ కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. పిల్లి పద్మ ఆంజనేయులు యాదవ్ నివాసంలో ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంతో భోజనం చేశారు. ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తున్నదని ,200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందని, ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తుందని,మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తుందని మంత్రి ప్రభాకర్ వెల్లడించారు. సన్న బియ్యంతో వండిన అన్నం వడ్డించి భోజనానికి ఆహ్వానించిన పిల్లి పద్మ కు ధన్యవాదాలు తెలిపారు.

గొప్ప కళాకారుడిని హుస్నాబాద్ కోల్పోయింది

- జనజాగృతి కళా సమితి అధ్యక్షుడు ముక్కెర నివాళి

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 5: తెలుగు వాళ్లంతా గర్వించదగిన కళాకారుడు వేముగంటి ప్రసాద్ అని, తను లేకపోవడం హుస్నాబాద్ ప్రాంతానికి గొప్ప లోటు అని జనజాగృతి కళా సమితి అధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ జానపద కళాకారుడు, గాయకుడు, రచయిత వేముగంటి ప్రసాద్ 12వ వర్ధంతిని పురస్కరించుకుని జన జాగృతి కార్యాలయంలో బుధవారం రోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుస్నాబాద్ మండలం పోతారానికి చెందిన వేముగంటి ప్రసాద్ ప్రసిద్ధ గాయకుడని అన్నారు. తను పాడిన అనేక సామాజిక, జానపద, భక్తి, యుగళ గీతాలు ఈనాటికీ శ్రోతలను రంజింప చేస్తున్నాయన్నారు. తను అనారోగ్యం పాలై 2013లో మరణించడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసాద్ తన పాటల ద్వారా హుస్నాబాద్ కీర్తి ప్రతిష్టలను ప్రపంచవ్యాప్తం చేశారని గుర్తు చేశారు. త్వరలో ఆయన జ్ఞాపకార్థం విద్యార్థులకు జానపద పాటల పోటీలు నిర్వహిస్తామని సంపత్ వెల్లడించారు.

రాష్ట్రంలో వరల్డ్ క్లాస్ ఫిలిం సిటీ ఏర్పాటు

- సినీ పరిశ్రమకు మేలు చేసింది కాంగ్రెస్సే
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5 : రాష్ట్ర ప్రభుత్వం వరల్డ్ క్లాసు ఫిలిం సిటీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి తెలుగు క్లబ్ లో సినీ రంగ ప్రముఖులు, శ్రీరంగ కార్మిక నాయకుల సమావేశంలో ప్రసంగించారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమ గురించి చాలామంది చాలా రకాలుగా మాట్లాడుతున్నారు కానీ, నాడు ఉమ్మడి రాష్ట్రంలో నేడు ప్రత్యేక రాష్ట్రంలో సినీ పరిశ్రమకు ఏదైనా మేలు జరిగిందంటే, అది కాంగ్రెస్ ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే అని అన్నారు. వేలాది మంది సినీ కార్మికుల జీవితాలను మెరుగుపరచడానికి, చెన్నైలో ఉన్న సినీ పరిశ్రమను హైదరాబాద్ రప్పించడానికి సినీ స్టూడియోలు నిర్మించేందుకు ప్రభుత్వమే భూములు ఇచ్చిందని వివరించారు. ఫిలిం క్లబ్ కు స్థలం సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. సీనియర్ నటుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో చిత్రపురి కాలనీ ఏర్పాటు కోసం దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డిని అడిగి మరీ ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. సినీ పరిశ్రమకు ఏ సమస్య వచ్చినా ఎలాంటి వినతి వచ్చినా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్డీసీ చైర్మన్ దిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బ్రహ్మణులకు పదవులు ఇవ్వలేదు

- కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి పదవి వచ్చింది
- కార్తీకవన సమారాధనలో మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5 : పదేండ్ల బీఆర్ఎస్ సర్కారు పాలనలో బ్రాహ్మణులకు మంత్రి పదవులలో అవకాశం ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీ శాఖ మంత్రిగా అవకాశం ఇచ్చిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శ్రీనగర్ కాలనీలోని సత్యాసాయి నిగమాగమంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బ్రాహ్మణ కార్తీక వనసమారాధన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. బ్రాహ్మణులు సంఘటితంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి ముందుంటానని హామీ ఇచ్చారు. ఎన్నికలు వచ్చాయని కాదని, తన వ్యక్తిత్వం అందరికీ తెలుసని, అండగా ఉంటానని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలో స్థానిక నేత నవీన్ యాదవ్ పై ప్రతిపక్షాలు దుష్ప్రచారాన్ని చేస్తున్నాయన్నారు. ఇక్కడ వేదికపై ఉన్నవారికి నవీన్ యాదవ్ గురించి తెలుసని, సేవాతత్వం ఉన్న ఉన్నత విలువలు గల వ్యక్తని గుర్తుచేశారు. తనను వారంతా ఆశీర్వదించినట్టుగానే నవీన్ యాదవ్ ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, మెట్రో ఇండియా అధినేత లక్ష్మీరాజ్యం, సమాఖ్య అధ్యక్షులు సీహెచ్ ప్రభాకరరావు, సెక్రటరీ చంద్రశేఖర్, తులసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదల కడుపు నింపడం గొప్ప విషయమే

- దళిత సమ్మేళనంలో మంత్రి వాకిటి శ్రీహరి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5 : ఎస్సీ వర్గీకరణ అమలు చేసినందుకు కృతజ్ఞతగా వెంగళరావునగర్ డివిజన్ లో బుధవారం కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా దళిత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మంత్రులు వాకిటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సభలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ఓటు అంబేద్కర్ ఇచ్చిన వజ్రాయుధమని, ఆ ప్రాంత ప్రజల అభివృద్ధి గురించి ఆలోచించే వారికి ఓటు వేస్తేనే దానికి విలువ ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ కి మూడు పర్యాయాలు అధికారం ఇచ్చిన తరువాత కూడ ఈ ప్రాంతంలో మురికి కాలువలు, హై టెన్షన్ వైర్లు,తాగునీటి సమస్యలు ఎందుకు ఉన్నాయో ఒకసారి ప్రజలు ఆలోచించాలన్నారు.మాయమాటలు చెల్లుబాటయ్యే రోజులు ఎప్పుడో పోయాయన్నారు. ఇప్పటికే జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని గుర్తు చేశారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి కులగణన చేశారన్నారు, మూడు దశాబ్దాల ఎస్సీల చిరకాల ఆకాంక్ష అయిన వర్గీకరణను అమలు చేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. నవీన్ యాదవ్ ను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి బాధ్యత తాము తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, మేడి పాపన్న, సతీశ్ తదితర దళిత నాయకులు పాల్గొన్నారు.

వర్జీనియా గవర్నర్‌గా హైదరాబాదీ

- న్యూయార్క్ మేయర్‌గా దక్షిణాసియావాసి
- డొనాల్డ్ ట్రంప్ కు షాకిచ్చిన డెమొక్రటిక్ నేతలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5 : అమెరికా స్థానిక ఎన్నికలలో భారత సంతతికి చెందిన పలువురు నేతలు సత్తా చాటారు. వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా డెమొక్రటిక్ పార్టీకి చెందిన నాయకురాలు గజాలా హష్మీ ఘన విజయం సాధించారు. అమెరికాలో ఈ పదవికి ఎన్నికైన తొలి ముస్లిం మహిళగా సరికొత్త రికార్డు సృష్టించారు. ఈమె హైదరాబాద్ మూలాలు ఉన్న మహిళ కావడం విశేషం. గజాలా హష్మీ 1964లో హైదరాబాద్‌లో జన్మించారు. మలక్‌పేటలో తన అమ్మమ్మ ఇంటిలో కొంతకాలం నివసించారు. ఆమె తాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఫైనాన్స్ డిపార్టుమెంటులో పని చేశారు. నాలుగేండ్ల వయసులోనే తన తల్లి, సోదరుడితో కలిసి గజాలా హష్మీ అమెరికాలోని జార్జియాకు వెళ్లారు. అక్కడే స్థిరపడ్డారు. ఆమె తండ్రి అక్కడి ప్రసిద్ధ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా పని చేసేవారు. గజాలా, జార్జియా సదరన్ యూనివర్సిటీలో బీఏ ఆనర్స్ చదివారు. అట్లాంటాలోని ఎమరి వర్సిటీ నుంచి పీహెచ్‌డీ చేశారు. అజహర్ తో వివాహం అనంతరం 1991లో రిచ్‌మండ్ ప్రాంతానికి మారారు. 30 యేండ్ల పాటు అక్కడే రేనాల్డ్స్ కమ్యూనిటీ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేశారు. 2019లో జరిగిన అమెరికా ఎన్నికలో తొలిసారిగా గెలుపొందారు. 2024లో మెడికల్ కమిటీ చైర్‌పర్సన్‌గా డెమొక్రటిక్ పార్టీ తరఫున ఎన్నికయ్యారు.

దక్షిణాసియా మూలాలున్న నాయకుడు మమ్ దాని

డొనాల్డ్ ట్రంప్‌కు షాకిస్తూ డెమొక్రటిక్ పార్టీకి చెందిన భారత్ -ఉగాండా మూలాలన్న జొహ్రాన్ మమ్‌దాని న్యూయార్క్ మేయర్ ఎన్నికలలో విజయకేతనం ఎగురవేశారు. న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన తొలి దక్షిణాసియా మూలాలున్న నాయకుడిగా మాత్రమే కాకుండా, తొలి ముస్లిం కూడా కావడం విశేషం. మమ్‌దాని తల్లి ప్రముఖ భారతీయ దర్శకురాలు మీరా నాయర్. అతని తండ్రి మహ్మద్ మమ్‌దాని కాగా, ఆయన ఉగాండా పౌరుడు. కొలంబియా





యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. మమ్‌దాని ఉగాండాలోని కాంపాలాలో జన్మించారు. ఏడేండ్ల వయసులో కుటుంబంతో కలిసి న్యూయార్క్‌కు వలస వెళ్లారు. 2018లో అమెరికా సిటిజెన్ షిప్ లభించింది. బ్రాంక్స్ హై స్కూల్ ఆఫ్ సైన్స్‌లో చదివి, తరువాత బౌడోయిన్ కాలేజీ నుంచి ఆఫ్రికానా స్టడీస్‌లో డిగ్రీ పూర్తి చేశారు. సోషలిస్ట్ ఐడియాలజీ ఉన్న మమ్‌దానీ న్యూయార్క్ మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోను ఓడించి విజయం సాధించడం విశేషం.

“

నాపై ద్వేషంతోనే కరూర్ తొక్కిసలాటపై ముఖ్యమంత్రి స్టాలిన్ అసెంబ్లీలో ఆరోపణలు చేశారు. కరూర్‌బాధితుల్ని ఆదుకున్నా కూడా రాజకీయ, ప్రభుత్వ, మీడియా విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. దీంతోనే నిష్పాక్షిక విచారణ జరగదని సుప్రీం గుర్తించింది. ఎన్నికల్లో డీఎంకే, టీవీకే మధ్యే పోటీ ఉంటుంది.

- టీవీకే చీఫ్ విజయ్

ఓపెన్ వాయిస్

మారుతున్న అగ్రరాజ్యం తీరు

రాబోయే పదేండ్లలో రక్షణ రంగంలో సహకారం పెంపొందించుకోవడానికి వీలైన మౌలిక విధానంపై భారత్, అమెరికా మధ్య ఒక ఒప్పందం కుదిరింది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్, భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మధ్య కౌలాలంపూర్‌లో జరిగిన సమావేశం తర్వాత ఈ ఒప్పందాన్ని ప్రకటించారు. 'ఈ ఒప్పందం సమన్వయం, సమాచార మార్పిడి, సాంకేతిక సహకారాన్ని పెంపొందిస్తుంది. ప్రాంతీయ స్థిరత్వాన్ని పెంచుతుంది. సంఘర్షణలు పెరగకుండా నివారిస్తుంది' అని పీట్ హెగ్సేత్ ఎక్స్‌లో రాశారు. అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్, భారత్‌పై 50 శాతం సుంకాలు విధించాక, ఉద్రిక్తంగా మారిన సంబంధాలను చక్కదిద్దే ప్రయత్నాలు జరుగుతున్న వేళ, రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి తుదిరూపు ఇచ్చే యత్నాలలో ఉన్న సమయంలో ఈ ఒప్పందం కుదిరింది. ట్రంప్ టారిఫ్‌లో రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేసినందుకు జరిమానాగా విధించిన 25 శాతం కూడా కలిసి ఉంది. 'ఇప్పటికే బలంగా ఉన్న మన రక్షణ భాగస్వామ్యంలో ఈ ఒప్పందం కొత్త శకానికి నాంది పలుకుతుంది. ద్వైపాక్షిక సంబంధాలలో రక్షణ అనేది మూల స్తంభంగా ఉంటుంది. స్వేచ్ఛాయుత, బహిరంగ, నియమ నిబంధనలకు కట్టుబడి ఉండే ఇండోపసిఫిక్ ప్రాంతాన్ని సురక్షితంగా మార్చడానికి ఈ ఒప్పందం చాలా ముఖ్యం' అంటూ భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ ఒప్పందం గురించి సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రెండు దేశాల మధ్య టారిఫ్ వివాదాల ప్రభావం గురించి యురేషియా గ్రూప్ థింక్ ట్యాంక్ ప్రమిత్ పాల్ చౌదరిని బీబీసీ ప్రతినిధి షెర్లిన్ మోలాన్ ప్రశ్నించారు. 'ఈ ఒప్పందం ఈ యేడాది జూలై- ఆగస్టులో పూర్తి కావాల్సింది. కానీ, పాకిస్తాన్‌తో సంఘర్షణను ముగించానంటూ ట్రంప్ చేసిన ప్రకటనలపై భారత్ అసంతృప్తి చెందడం వల్ల అది ఆలస్యమైంది' అని ప్రమిత్ పాల్ అన్నారు. రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాల శ్రేణిలో ఇది తాజా ఒప్పందమని ప్రమిత్ పాల్ చెప్పారు. 'ఈ ఒప్పందం రెండు దేశాల సైన్యాల మధ్య సమన్వయాన్ని పెంచుతుంది. భారత్‌కు సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. రక్షణ రంగంలో రెండు దేశాల సైన్యాలు కలిసి పని చేయడం అటు సులభమవుతుంది' అని ఆయన అన్నారు. ఇటీవలి కాలంలో భారత్, అమెరికా తమ రక్షణ సంబంధాలను బలోపేతం చేస్తున్నాయి. ఈ యేడాది ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోడీ అమెరికాలో పర్యటించారు. ట్రంప్‌తో జరిగిన చర్చలలో రక్షణ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. భారత్‌కు సైనిక సామగ్రి విక్రయాలను అనేక బిలియన్ డాలర్లకు పెంచుతానని, దీంతో భారత్‌కు ఎఫ్35 స్టెల్త్ యుద్ధ విమానాలు లభించే మార్గం తెరుచుకుంటుందని ట్రంప్ అన్నారు. కానీ, అప్పటి నుంచి, రష్యా నుంచి చౌకగా భారత్ చమురును కొనడం, రష్యాతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల రక్షణ సంబంధాలు ట్రంప్ ప్రభుత్వానికి ఆందోళన కలిగించే అంశాలుగా మారాయి. రెండు దేశాల మధ్య కుదిరిన ఈ ఒప్పందం ఎంత ముఖ్యమైనదని సనా హష్మీని ఆయన అడిగారు. 'ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. ట్రంప్ ట్వీట్లకు, ఆయన సోషల్ మీడియా కార్యకలాపాలకు మనం చాలా ప్రాముఖ్యం ఇస్తున్నామని అనుకుంటున్నా. వీటి ఆధారంగానే మనం భారత్-అమెరికా సంబంధాలను అంచనా వేస్తున్నాం. రెండు దేశాల మధ్య సంబంధాలలో చీలిక ఏర్పడిందని చెబుతున్నాం. ఎవరైనా ఒక నాయకుడి మూలంగా ఒక రెండు దేశాల సంబంధాలు పెద్దగా ప్రభావితం కావు. అటు డొనాల్డ్ ట్రంప్ పదవీకాలం ముగిసిన తర్వాత ఇప్పుడున్న పరిస్థితి మారుతుంది' అని సనా హష్మీ అభిప్రాయపడ్డారు. దక్షిణ కొరియాలో డోనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సమావేశమయ్యారు. చైనాపై విధించిన 'ఫెంటానిల్ టారిఫ్' ను కుదిస్తున్నట్లు తర్వాత ట్రంప్ ప్రకటించారు. ట్రంప్- షీ జిన్‌పింగ్ కలుసుకున్నప్పటికీ వారిద్దరి మధ్య సంబంధాలు సానుకూల దిశలో వెళ్తున్నాయని మనం చెప్పలేం. చైనాను ఎదుర్కోవడానికి అమెరికాకు భారత్ సహాయం చాలా అవసరం.

ప్రతిపక్షం
హైదరాబాద్
గురువారం
06.11.2025

ఆ మహిళల విజయం వెనుక 'అద్భుత శక్తి'

రాహుల్ ద్రావిడ్ రాక తరువాత మిడిల్ ఆర్డర్ లో తన స్థిరమైన ఆటతీరుతో 'ది వాల్' అనే పేరుతో జట్టులో స్థానం సుస్థిరం చేసుకోవడంతో తరచుగా 'తదుపరి టెండూల్కర్' అని ముద్రపడ్డ అమోల్ ముజుందార్ అంతర్జాతీయంగా భారతదేశానికి ప్రాతినిధ్యం వహించని గొప్ప దేశీయ దిగ్గజంగానే మిగిలిపోయాడు. భారత మహిళా క్రికెట్ జట్టు ఐసీసీ 2025 వరల్డ్ కప్ చేజిక్కించుకోవడంతో జట్టు ప్రధాన శిక్షకుడు అమోల్ ముజుందార్ పేరు ఒక్కసారి తారాజువ్వలా పైకి ఎగిసి దేశమంతా మార్మోగిపోతోంది. కానీ, భారత మహిళా జట్టు ఈ అపూర్వ విజయాన్ని సాధించి ఉండకపోతే ప్రతిభావంతుడైన అమోల్ ముజుందార్ పేరు చరిత్ర పుటలలో గుర్తింపు లేకుండా శిథిలమైపోయి ఉండేది.

యేచన్ చంద్రశేఖర్
8885050822

నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో నవంబర్ రెండు ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో భారత మహిళల క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికా జట్టు మీద సమిష్టి కృషితో బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్ లో అద్వితీయ ప్రతిభ చూపి 52 పరుగుల తేడాతో తొలిసారి ఐసీసీ మహిళల వన్డే ప్రపంచ కప్ కైవసం చేసుకుంది. 1978లో మొట్టమొదటిసారి ఐసీసీ మహిళల క్రికెట్ పోటీలో అడుగుపెట్టిన భారత మహిళల జట్టు 47 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం 13వ ఐసీసీ మహిళల వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకోవడం దేశవ్యాప్తంగానే కాక ప్రపంచంలోని వివిధ దేశాలలో నివసిస్తున్న భారతీయులను ఆనందపారవశ్యాలలో ముంచెత్తింది. వరుసగా 1978, 1997, 2013,2025లో ఐసీసీ మహిళల వన్డే ప్రపంచ కప్‌కు భారత్ ఆతిథ్యమిచ్చినప్పటికీ కప్‌ను గెలుచుకోవడం మాత్రం ఇదే తొలిసారి.

అసాధారణ శిక్షకుడు

ప్రతి పురుషుని విజయం వెనుక అదృశ్యంగా ఒక స్త్రీ పాత్ర ఉంటుందని అంటుంటారు. అయితే, భారత మహిళా క్రికెట్ జట్టు ఈ అసాధారణ విజయం వెనుక ఒక పురుషుని అదృశ్య కృషి ఉంది. ఆయన మరెవరో కాదు భారత ప్రఖ్యాత మేటి బ్యాటర్ సచిన్ టెండూల్కర్, వినోద్ కాంబ్లీ మిత్రుడు, సమకాలీనుడు అమోల్ ముజుందార్. ఆయన కూడా సచిన్ టెండూల్కర్ ను దేశానికి అందించిన రమాకాంత్ అచ్రేకర్ శిష్యుడే. ప్రశాంతత, సానుభూతిగల నాయకత్వానికి పేరుగాంచిన అమోల్ ముజుందార్ భారత మహిళా క్రికెట్ జట్టులో క్రమశిక్షణ, నమ్మకం, స్థితిస్థాపకతను ప్రేరేపించడం ద్వారా కోచింగ్ విజయాన్ని పునర్నిర్వచించారు. 2014లో రిటైర్ అయిన తర్వాత కోచ్‌గా స్థిరపడ్డాడు. భారతదేశంలోని అండర్19, అండర్23 జట్ల శిక్షణతో ప్రారంభమైన అతని ప్రతిభ దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా, ఐపీఎల్ ఫ్రాంచైజ్ రాజస్థాన్ రాయల్స్‌లో బ్యాటింగ్ కోచ్‌గా, నెదర్లాండ్స్ పురుషుల జట్టు కోచ్‌గా అంతర్జాతీయ స్థాయిలకు చేరుకుంది. ముజుందార్ తన ప్రశాంత నాయకత్వంతో, ఆగ్రహావేశాలు ప్రదర్శించకుండా క్రీడాకారుల పట్ల సానుకూల వైఖరితో, నిశ్శబ్దంగా దృఢమైన విశ్వాసాన్ని పాదుకొల్పి వారిని ప్రేరేపించడం ద్వారా స్థిరమైన మెరుగుదలపై దృష్టి సారిస్తాడని పేరుపొందాడు.

దాదాపు 10 నెలలుగా ఖాళీగా ఉండటంతో

భారత మహిళా క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ పదవి దాదాపు 10 నెలలుగా ఖాళీగా ఉండటంతో, భారత క్రికెట్ నియంత్రణ మండలి అమోల్ ముజుందార్‌ను అక్టోబర్ 2023లో నియమించింది. అంతర్జాతీయ క్రికెట్ పెద్దగా ఆడకపోవడంతో మొదట్లో ఆయన నియామకంపై వివాదం నెలకొన్నప్పటికీ, కోచ్‌గా అతని అద్భుత దేశీయ రికార్డు, నైపుణ్యం స్వల్పకాలంలోనే ఆటగాళ్లతో సహా క్రికెట్ వర్గాలను ఆకర్షించింది. భారత మహిళా జట్టు అద్భుతంగా రూపాంతరం చెంది మొట్టమొదటి సారి 2025 ఐసీసీ మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకోవడం ఆయన శిక్షణా నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

టోర్నమెంట్ ప్రారంభంలోనే ఓడిపోయినప్పటికీ ఏమాత్రం ఆత్మస్థైర్యం కోల్పోకుండా, పటిష్టమైన ఆస్ట్రేలియా జట్టుపై సెమీఫైనల్ లో సాధించిన స్ఫూర్తిదాయకమైన విజయం, ఆ తర్వాత దక్షిణాఫ్రికాపై జరిగిన ఫైనల్‌లో చారిత్రాత్మక విజయం భారత జట్టు సమిష్టితత్వానికి, అమోల్ ముజుందార్ శిక్షణా నైపుణ్యానికి గొప్ప మైలురాయిగా నిలుస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. సెమీ ఫైనల్ మ్యాచ్ సమయంలో 'మన జట్టు విజయానికి మరొక పరుగు అవసరం' లాంటి అతని ప్రోత్సాహకరమైన సందేశాలు ఆటగాళ్లను ఎంతగానో ప్రేరేపించాయి. భావోద్వేగంతో కూడిన, దృఢమైన సునిశిత మానవీయమైన నాయకత్వంతో అతను ఆటగాళ్లలో విశ్వాసం పాదుకొల్పడం, జెమిమా రోడ్రిగ్స్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లోకి పంపడం వంటి అతని సాహసోపేతమైన వ్యూహాత్మక నిర్ణయాలతో పాటు క్రాంతి గౌడ్, శ్రీ చరణి వంటి యువ ప్రతిభావంతులకు మద్దతు ఇవ్వడానికి ముజుందార్ చూపిన సంకల్పం సత్ఫలితాన్నిచ్చిందని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తమ శిక్షకుడి పట్ల గౌరవంతో కూడిన అభిమానాన్ని చాటుకుంది.

అవార్డులు, రివార్డులు

ముజుందార్ అంతర్జాతీయ క్రీడాకారుడిగా అవార్డులను అందుకోకపోయినా, కోచ్‌గా అతని అంకితభావం, విజయాలు అసాధారణ మలుపుగా పరిగణించబడుతున్నాయి. అతని ప్రభావవంత నాయకత్వం భారత మహిళా క్రికెట్‌ను ప్రపంచ వేదికపై ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడంతో పాటు యువ క్రీడాకారులు, కోచ్‌లకు స్ఫూర్తినిచ్చింది. భారత మహిళా జట్టు తొలి ప్రపంచ కప్ టైటిల్‌ను కైవసం చేసుకునేందుకు వారికి తగు శిక్షణనిచ్చి తన క్రీడా నైపుణ్యంతో పాటు మానసికంగా సంసిద్ధులను చేసిన తీరు భారత దేశ మహిళా క్రికెట్ చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలిచిపోతుంది.

అమోల్ ముజుందార్ గతం

అమోల్ ముజుందార్ లెజెండరీ కోచ్ రమాకాంత్ అచ్రేకర్ ఆధ్వర్యంలో తన క్రికెట్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నాడు. 24 ఫిబ్రవరి 1988న ముంబై ఆజాద్ మైదాన్‌లోని ససానియన్ గ్రౌండ్‌లో శారదాశ్రమ్ విద్యా మందిర్, సెయింట్ జేవియర్స్ మధ్య జరిగిన హారిస్ షీల్డ్ ట్రోఫీ మ్యాచ్ సందర్భంగా సచిన్ టెండూల్కర్, వినోద్ కాంబ్లీ మధ్య 664 పరుగుల భాగస్వామ్యం ఏర్పడడంతో తదుపరి బ్యాటర్ గా ప్యాడ్స్ కట్టుకుని ఎంతో ఉత్సాహంగా సిద్ధంగా ఉన్నప్పటికీ అతనికి తన ఆటను ప్రదర్శించే అవకాశమే దక్కలేదు. ఈ బలమైన పునాది క్రికెట్ క్రమశిక్షణ, సాంకేతికత రూపొందించడంలో ఆయనకు సహాయపడడమే కాకుండా భారత దేశీయ క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్లను అందించింది. ఆ రోజులలో భారత జట్టు మిడిల్ ఆర్డర్‌లో రాహుల్ ద్రావిడ్, సచిన్ టెండూల్కర్, గంగూలీ, వీవీఎస్ లక్ష్మణ్ లాంటి ఆటగాళ్ల బలమైన పోటీ అతన్ని అంతర్జాతీయ క్రికెట్ లో స్థానం సంపాదించకుండా నిరోధించింది. 1996 ఒకసారి వినోద్ కాంబ్లీ పేలవమైన ఆటతీరు కారణంగా దాదాపు అవకాశం వచ్చినప్పటికీ, రాహుల్ ద్రావిడ్ రాక ఆ తరువాత మిడిల్ ఆర్డర్ లో తన స్థిరమైన ఆటతీరుతో 'ది వాల్' అనే పేరుతో జట్టులో స్థానం సుస్థిరం చేసుకోవడంతో తరచుగా 'తదుపరి టెండూల్కర్' అని ముద్రపడ్డ అమోల్ ముజుందార్ అంతర్జాతీయంగా భారతదేశానికి ప్రాతినిధ్యం వహించని గొప్ప దేశీయ దిగ్గజంగానే మిగిలిపోయాడు.

కొసమెరుపు

భారత మహిళా క్రికెట్ జట్టు ఐసీసీ 2025 వరల్డ్ కప్ చేజిక్కించుకోవడంతో జట్టు ప్రధాన శిక్షకుడు అమోల్ ముజుందార్ పేరు ఒక్కసారి తారాజువ్వలా పైకి ఎగిసి దేశమంతా మార్మోగిపోతోంది. కానీ, భారత మహిళా జట్టు ఈ అపూర్వ విజయాన్ని సాధించి ఉండకపోతే ఇంత ప్రతిభావంతుడైన అమోల్ ముజుందార్ పేరు చరిత్ర పుటలలో ఎటువంటి గుర్తింపు లేకుండా శిథిలమైపోయి ఉండేది.

(వ్యాస రచయిత భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ రాష్ట్ర మాజీ కార్యదర్శి)

ఇది 'లక్ష' బోగస్ ఉద్యోగుల డ్రామా!

తెలంగాణ ప్రభుత్వం తక్షణమే మేల్కొని, తమ చర్యలలో పారదర్శకత పాటించాలి. రూ. 18 వేల కోట్ల స్కామ్‌పై స్పష్టత ఇవ్వకుండా, చిరుద్యోగులపై బురద జల్లడం ఆపాలి. నిజాయితీగా పనిచేస్తున్న సిబ్బందికి వెంటనే జీతాలు చెల్లించి, వారి సమస్యలను పరిష్కరించాలి. పాలకపక్షం జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ, ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలి.

ఫిరోజ్ ఖాన్
9640466464

రాష్ట్రంలో అధికార మార్పు జరిగిన తర్వాత, ఉద్యోగుల పాలిట కష్టాలు మొదలయ్యాయి. గత 'పదేండ్ల' పాలనలో జరిగిన రూ. 18 వేల కోట్ల అవకతవకలను మీద పరిశోధన జరుపుతున్నామనే ముసుగులో ప్రస్తుత పాలకపక్షం నిస్సహాయ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందిపైనే దృష్టి సారించింది. 'లక్ష' మంది దొంగ ఉద్యోగులున్నారనే నిరాధార ప్రచారాన్ని సృష్టించి, తమ ఆర్థికపర నిర్వహణ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని చూస్తోంది. ఉద్యోగుల పీఆర్‌సీ డిమాండ్‌ను అణచివేసే వ్యూహంలో భాగంగా, శ్రమజీవుల ఆత్మగౌరవాన్ని బలి చేస్తున్నారు. నిజమైన బడా స్కామ్‌ల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే కుట్ర పన్నుతున్నారనేది విశ్లేషకుల అభిప్రాయం. ఇక్కడ లక్ష మందికి పైగా నకిలీ ఉద్యోగులున్నారని, రూ. 18 వేల కోట్లు దోపిడీ జరిగిందని కొన్ని మాధ్యమాలలో ప్రచారం జరిగింది. ఇదంతా కేవలం పాత ప్రభుత్వంపై బురద జల్లి, తమ అసమర్థతను కప్పి పుచ్చుకునే రాజకీయ నాటకమే. సరైన ఆధారాలు చూపకుండా, ఇంత పెద్ద మొత్తంలో ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ ప్రయోజనం తప్ప మరొకటి లేదు. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు మాట్లాడిన మాటలకు, ఇప్పుడు అధికారంలో ఉన్నప్పుడు అమలు చేస్తున్న చర్యలకు పొంతన లేదు.

ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు

ఆరోపణలను సాకుగా చూపి, ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించిందని గుసగుసలు వినబడుతున్నాయి. అక్టోబరు 25 గడువుగా నిర్ణయించి, తాత్కాలిక సిబ్బంది ఆధార్ వివరాలను ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని, లేదంటే తదుపరి నెల జీతాలు నిలిచిపోతాయని ఉత్తర్వులు జారీచేసింది. ఈ చర్యతో రెండు లక్షల మందికి పైగా సిబ్బందిలో భయాందోళనలు నెలకొన్నాయి. అధికారుల లోపాలను, డేటా లేమిని ఉద్యోగుల తప్పిదాలుగా చిత్రీకరించి, వారిని వేధించడం సరికాదు. అధికారిక లెక్కలు తేలిన తర్వాత, వారం, పది రోజులలోనే అసలు సత్యం వెలుగులోకి వచ్చింది. లక్ష మంది బోగస్ ఉద్యోగులు అనే ప్రచారం అబద్ధమని నిరూపితమైంది. రాష్ట్రంలో 5,21,000 మంది రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా, 4,93,820 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నట్లు స్పష్టమైంది. అంటే, నిరాధార ఆరోపణలు చేసిన పాలకపక్షం, ఇప్పుడు ఈ అంశంలో ఎందుకు మౌనం వహిస్తోంది? రూ. 18 వేల కోట్ల ఆరోపణపైనా ఇప్పటికీ ప్రజలకు సమాధానం ఇవ్వడం లేదు.

ఉద్యోగుల పోరాటం

దుష్ప్రచారం అసలు లక్ష్యం, ఉద్యోగుల హక్కుల పోరాటాన్ని బలహీనపరచడమే. పీఆర్‌సీ వంటి న్యాయమైన డిమాండ్లతో పోరాడుతున్న రాష్ట్ర ఉద్యోగులను అణచివేయడానికి, వారిని సమాజంలో చులకన చేసే కుయుక్తిని పన్నారు. లక్షా ఇరవై వేల మందిని తొలగిస్తారన్న ప్రచారం వెనుక ఉన్న రాజకీయం ఉద్యోగులలో భయాన్ని పెంచడం కోసమే. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ఉద్యోగుల పక్షాన మాట్లాడిన పాలకులే ఇప్పుడు వారిని ఈ రకంగా వేధిస్తున్నారు. కేవలం రూ. 13,500 నుంచి రూ.18,000 వంటి స్వల్ప వేతనంపై ఆధారపడిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు నిలిపివేత, బెదిరింపులు దారుణం. నెలల తరబడి వేతనాలు అందక, ఆ నిరుపేద కుటుంబాలు ఆర్థిక కష్టాలలో చిక్కుకున్నాయి. తమ న్యాయమైన జీతాల కోసం ఆందోళన చేయాల్సిన దుస్థితికి ఈ సిబ్బందిని పాలకపక్షమే నెట్టింది. రాజకీయ క్రీడలో పేద ఉద్యోగులను బలి చేయడం అమానవీయం.

ఉద్యోగుల రక్షణ

తెలంగాణ ప్రభుత్వం తక్షణమే మేల్కొని, తమ చర్యలలో పారదర్శకత పాటించాలి. రూ. 18 వేల కోట్ల స్కామ్‌పై స్పష్టత ఇవ్వకుండా, చిరుద్యోగులపై బురద జల్లడం ఆపాలి. నిజాయితీగా పనిచేస్తున్న సిబ్బందికి వెంటనే జీతాలు చెల్లించి, వారి సమస్యలను పరిష్కరించాలి. పాలకపక్షం జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ, ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలి.

(వ్యాస రచయిత సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

సాయుధ సంక్షోభాలతో ప్రకృతి విధ్వంసం

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

యుద్ధాలు, సాయుధ సంఘర్షణలు అంటే మారణహోమమే. గాయపడిన సైనికులు, పౌర సమాజ అభాగ్యుల హాహాకారాలే. యుద్ధాలలో ఆస్తుల ధ్వంసం, మౌలిక వసతుల వినాశనం తప్పనిసరి అని మనకు తెలుసు. యుద్ధాలు లేదా సాయుధ సంఘర్షణలు జరిగినపుడు ప్రపంచ మానవాళికి తెలిసేది మరణించినవారి సంఖ్య, గాయపడినవారి వివరాలు, కూలిన భవనాలు, దెబ్బతిన్న మౌలిక వసతులు మాత్రమే. నగరాలు నేలమట్టం అవుతాయి. ఈ అపార నష్టాలతో పాటు యుద్ధాల వల్ల పర్యావరణానికి అపార నష్టాలు జరుగుతాయి. యుద్ధాలు జరిగినపుడు జల, వాయు, నేల కాలుష్యాలు నమోదవుతాయి. వ్యవసాయం కుంటుబడుతూ, ఆ ప్రదేశాలలో ఆహార అభద్రత పెరుగుతుంది. జీవనోపాధులు పలుచబడతాయి. ఆకలి కేకలు పెరుగుతాయి. వలసలతో పర్యావరణ క్షీణత పెరుగుతుంది. అడవులు తరిగి, వన్యప్రాణుల కూడా నష్టం జరుగుతుంది. సహజ వనరులు లేదా గనులు విచ్ఛిన్నం అవుతాయి. చమురు పరిశ్రమలు దెబ్బతింటాయి. కలప, వజ్రాలు, బంగారం, విలువైన ఖనిజాల సంబంధ కార్యకలాపాలు దెబ్బతింటాయి.

40 శాతం సంఘర్షణలలో పర్యావరణం

గత ఆరు దశాబ్దాలలో జరిగిన 40 శాతం సంఘర్షణలలో పర్యావరణం అపార నష్టాలను మూటకట్టుకొని, రేపటి తరం ఆరోగ్యకరమైన మన జీవితాలను ప్రశ్నార్థకం చేస్తున్న విషయాలను గుర్తించిన ఐరాస జనరల్ అసెంబ్లీ 2001లో తీసుకున్న తీర్మానం ప్రకారం యేటా ఆరు నవంబరున 'యుద్ధాలు, సాయుధ సంఘర్షణలలో పర్యావరణ దోపిడీని నివారించే అంతర్జాతీయ దినోత్సవం' పాటించడం ఆనవాయితీగా మారింది. యుద్ధాల సమయంలో పర్యావరణ వ్యవస్థల సహజత్వాలను కాపాడడం, సహజ వనరుల సుస్థిర నియంత్రణ చేయడం, శాంతి స్థాపన చర్యలు తీసుకోవడం, పర్యావరణ ఆరోగ్య సంరక్షణకు నిధులు కేటాయించడం లాంటి అంశాలను ప్రచారం చేయడం జరుగుతున్నది. ఈ మహత్తర బాధ్యతలను పౌర సమాజం, ప్రభుత్వాలు, సంస్థలు చేతులు కలిపి పర్యావరణ విధ్వంసం జరుగకుండా అడ్డుకోవాలి. శాంతి, భద్రత, సుస్థిరాభివృద్ధి, మానవాళి శ్రేయస్సును కాపాడడం, చట్టపరమైన రక్షణలు కల్పించడం, ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రపంచ స్థాయి సమన్వయం సాధించడం లాంటివి కొనసాగాలి.

బాంబుల మోతలు మోగుతాయి

యుద్ధాలు జరిగినపుడా బాంబుల మోతలు మోగుతాయి. భూమాత సహజత్వం కలుషితం అవుతుంది. రసాయన, హెవీ మెటల్ ప్రమాదాలు మీద పడతాయి. అడవుల విధ్వంసం జరుగుతుంది. మట్టి నాణ్యత మంటగలుస్తుంది. నీటి ఎద్దడి వెంటపడుతుంది. పేలని ల్యాండ్ మైన్స్ సమస్యలు ఉత్పన్నం అవుతాయి. మందుగుండు సామాగ్రి మట్టిని కలుషితం చేస్తుంది. యుద్ధాలతో దీర్ఘకాలిక సమస్యలు మానవాళిని తరుముతాయి. యుద్ధానంతరం కాలుష్య నివారణ అత్యంత ఖరీదు అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.5 బిలియన్లు, అనగా 20 శాతం జనాభా సంఘర్షణల విషవలయంలో చిక్కి విలవిల్లాడుతున్నారు. జీవవైవిధ్యం దెబ్బ తింటుంది. ప్రజారోగ్యం మంటగలుస్తుంది. పర్యావరణ క్షీణత రేపటి బతుకులకు భరోసాను తగ్గిస్తుంది. ఈ భయానక విషయాలను గుర్తించి పౌర సమాజం, ప్రభుత్వాలు తగు చర్యలను తీసుకుంటూ పర్యావరణాన్ని కాపాడే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. యుద్ధాలను అంతం చేయడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. మానవ శ్రేయస్సు కోసం మన ప్రతి అడుగు సన్మార్గం దిశగా పడాలి.

(నేడు యుద్ధాలు, సాయుధ సంఘర్షణలలో పర్యావరణ దోపిడీని నివారించే అంతర్జాతీయ దినోత్సవం)

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com

ప్రాంతీయం

శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు

ఎక్జిట్ గెట్ ద్వారా లోపలికి వెళ్తున్న భక్తులు

కీసరగుట్టకు పోటెత్తిన భక్తులు

- స్వామి వారి దర్శనం కావాలంటే పలుకుబడైన ఉండాలి !
- నాయకుడైన అయి ఉండాలి
- స్వామి వారి దర్శనం మొదట వివిపీలకే
- ఓ పక్క విధులు నిర్వహిస్తూ మరో పక్క శివారాధనలో మహిళ పోలీసులు

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 5. కీసర గుట్టలో ప్రసిద్ధిగాంచి స్వయంభూగా వెలిసిన శ్రీ భవాని శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా వేకువజామునే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆ పరమ శివుడికి భక్తులు దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వెలుపల కొలువైన శివలింగాలకు మహిళలు పాలాభిషేకం చేసారు. ఆలయంలో మహిళలు కుటుంబ సమేతంగా కార్తీక దీపాలు వెలిగించి తమ మొక్కలు చెల్లించుకున్నారు. బారీగా క్యూ లైన్ లో వేచిఉన్న భక్తులు కిలో మీటర్ మేర ఎండలో క్యూ కట్టి స్వామి వారిని దర్శించుకునే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశామణి తెలిపారు.

స్వామి వారి దర్శనం కావాలి అంటే ...

ఉదయం స్వామి వారి అభిషేకం కోసం వచ్చిన భక్తులకు మధ్యాహ్నం వరకు ఇంకా స్వామివారి అభిషేకాలు కావడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. స్వామి వారినీ దర్శించుకున్న అనంతరం ఎక్జిట్ గెట్ నుండి వెళుతున్న భక్తులు.అదే గేట్ నుండి పలుకుబడి కలిగిన నాయకులు లీడర్లు అంత రావడంతో సామాన్య భక్తులకు ఇబ్బందులకు గురయ్యారు. ఆలయ అధికారుల తీరుపై భక్తులు తీవ్రంగా మండిపడుతున్నారు.ప్రతి ఏటా కీసర గుట్టకు రావాలంటే ఇదే పరిస్థితి ఉంటుంది ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఓ పక్క విధులు నిర్వహిస్తూ

మరో పక్క శివార్చనలో మహిళ పోలీసులు

కార్తిక మాసం కీసర గుట్టలో కార్తీక పౌర్ణమి సందర్భంగా విధులు నిర్వహిస్తున్న మహిళ పోలీసులు, స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు సేవ చేసుకుంటూ అలాగే పరమ శివుడు సేవలో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. వారికి కూడా కనీస సౌకర్యాలు లేకపోవడంతో మండేటి ఎండలోనే భోజనం చేశారు. ఆలయ ఈ ఓ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ బయట ఉన్న శివలింగల వద్ద కొందరు స్వామీజీలు డబ్బులు వసూలు చేస్తున్నారు అనే విషయం మా దృష్టికి ఇప్పుడే వచ్చింది అని తెలిపారు.ఇకా నుండి భక్తులకు ఆలయం బయట ఉన్న శివలింగల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తాం అని అన్నారు.కీసర గుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలిగితే ఆలయం పక్కనే ఉన్న కార్యాలయంకి వచ్చి ఫిర్యాదు చేయగలరు అని భక్తులకు సూచించారు.

కీసర గుట్ట క్యూ లైన్లో వేచి ఉన్న భక్తులు

శివార్చనలో మహిళ పోలీసులు

హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై మరో ప్రమాదం

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 5 : మొయినాబాద్ కేంద్రంలోని తాజ్ హోటల్ ముందు చెట్టును కారు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుండి చేవెళ్ల వెళ్తున్న బెలెనో కారు మొయినాబాద్ లోని తాజ్ హోటల్ ముందు హైదరాబాద్‌బీజాపూర్ రహదారి పక్కన ఉన్న ఓ చెట్టును ఢీ కొట్టిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదని, చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారన్నారు. ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం డ్యామేజ్ అయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రోడ్డు పై ట్రాఫిక్ జాం కాకుండా కారును పక్కకు తొలగించారు. ఈ రహదారి పై ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

చేవెళ్ల రోడ్డు ప్రమాద బాధితురాలికి ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శ

ప్రతిపక్షం, ఉప్పల్, నవంబర్ 5 : చేవెళ్ల రోడ్డు ప్రమాద బాధితురాలిని ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఉప్పల్ నియోజకవర్గంలో లోని కాప్రా డివిజన్ పరిధిలోని సాయి బాబా నగర్ కి చెందిన తాడెం వెన్నెల తాండూర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఖానాపూర్ స్టేజి వద్ద ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటనలో ఈమె గాయపడి జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈమెను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులతో మాట్లాడి హాస్పిటల్ లో అయ్యే ఖర్చు ప్రభుత్వం కట్టే విధంగా చేయడం జరిగింది. అలాగే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన రహదారి భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, ప్రసాద్ గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో మృతి.. అవయవాలు దానం

ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్: 5. అవయవాలు దానం చేయండంతో అవి ఇతరులకు ఉపయోగపడతాయని నవాజ్ రెడ్డి, నరేందర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లికి చెందిన నారెడ్డి భూపతి రెడ్డి నవంబర్ 1వ తారీఖున జాతీయ రహదారిపై తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతూ యు టర్న్ చేస్తున్న సమయంలో ముందు నుండి వస్తున్న ద్విచక్ర వాహనం దీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయలపాలైన భూపతిరెడ్డిని ఘటన స్థలానికి చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రి కిమ్స్ కు తరలించారు. భూపతిరెడ్డి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చనిపోయారు. ఆయన సతీమణి రామలక్ష్మి, కుమారులు నవాజ్ రెడ్డి, నరేందర్ రెడ్డి కలిసి

భూపతిరెడ్డి ఊపిరితిత్తులు, లివర్, 2 కిడ్నీలను దానం చేసి గొప్ప మనసును చాటుకొని ఆదర్శనంగా నిలిచారు. తన తండ్రి చనిపోయిన తండ్రి అవయవాలు ఇతరులకు ఉపయోగపడితే చాలు అనే ఉద్దేశంతో అవయవాలను దానం చేసినట్లు తెలిపారు.

డా. చంటి ముదిరాజ్‌కు "సేవారత్న అవార్డు - 2025"

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5: హైదరాబాద్‌కు చెందిన సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షులు డా. చంటి ముదిరాజ్ కు ఢిల్లీ నుండి ప్రతిష్ఠాత్మక "సేవారత్న అవార్డు - 2025" లభించింది. ప్రజా హక్కుల సాధనలో నిరంతర సేవలు, సమాచార హక్కు చట్టం ప్రచారంలో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాలు, ప్రజా ప్రతినిధులు మరియు అభిమానులు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

97 మంది వృద్ధులు, వికలాంగుల ఓటు

- హోమ్ ఓటింగ్ ద్వారా వినియోగం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 5 : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం మధురా నగర్ లో హోమ్ ఓటింగ్ ప్రక్రియను బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ పరిశీలించారు. హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న 103 మందిలో 97 మంది తమ ఓటు హక్కును అ సందర్భంగా వినియోగించుకున్నారు.

కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాటం

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్
- సిఐటీయూ మండల నూతన కన్వీనర్ గా సిహెచ్. ప్రవీణ్ కుమార్

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 5 : కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడేది సీఐటీయూ మాత్రమేనని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్ అన్నారు. మొయిబాదాద్ మండల కేంద్రంలో సిఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 10,11 తేదీలలో రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్లో సిఐటియు జిల్లా నాలుగో మహాసభలు జరగబోతున్నాయని ఆ మహాసభలను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అనంతరం నూతన మండల కన్వీనర్ గా సిహెచ్. ప్రవీణ్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సిఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మీర్జాగూడ బస్సు ప్రమాదం ముమ్మాటికి ప్రభుత్వ హత్యే

- ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి.. జాతీయ రహదారి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.
- మంజూరైన రోడ్లన్నీంటిని త్వరగా పూర్తిచేయాలి
- లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తాం
- రోడ్లు రహదారుల ఉద్యమ వేదిక కన్వీనర్ షాపురం శ్రీకాంత్.

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 5 : మిర్జగూడ బస్సు ప్రమాదం ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని రోడ్లు రహదారుల ఉద్యమ వేదిక కన్వీనర్ షాపురం శ్రీకాంత్ అన్నారు. జాతీయ రహదారి రోడ్డు పనులను, మండలంలోని గ్రామాలకు మంజూరైనా నూతన రోడ్లను త్వరగా పూర్తి చేయాలని మండల కేంద్రంలో ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలోని అన్ని గ్రామాల రహదారులు, లింకు రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయని, వాటిపై ప్రయాణం చేయాలంటే నరకంగా ఉందన్నారు. మంజురైనా రోడ్లన్నింటీని త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మిర్జగూడ బస్సు ప్రమాదం పూర్తిగా అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్లే ఇంత ఘోర రోడ్డు ప్రమాదం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ల విషయంలో అధికారులు, పాలకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహారించడం సబబు కాదన్నారు. ప్రజల ప్రాణాలతో తమకు సంబంధం లేదన్న చందంగా వారి తీరు ఉందని ఆరోపించారు. మండలంలోని అన్ని లింకురోడ్లను తక్షణమే నిర్మించాలన్నారు. హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రోడ్డు నిర్మాణం పనుల్లో వేగం పెంచి త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,అనంత రెడ్డి, ప్రభాకర్,రాజమల్లేష్,మహేష్,పాండు,మహేందర్,మణికంఠ, ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఆటంకాలు తొలగించిన హైడ్రా

- టార్చ్ లైట్లేసి హైడ్రాకు ప్రజల ధన్యవాదాలు

ప్రతిపక్షం, సిటీ బ్యూరో, నవంబర్ 5: రోడ్డు నిర్మాణానికి ఆటంకాలు తొలగించిన హైడ్రాకు మణికొండ వెంకటేశ్వర కాలనీ తో పాటు పరిసర కాలనీల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న రోడ్డు మీదకు బుధవారం సాయంత్రం ర్యాలీ గా వచ్చి సెల్ ఫోన్ల టార్చ్ వేసి హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు. చుట్టూ రహదారులున్నా వేంకటేశ్వర కాలిని నుంచి తారామతి బారాదరికి రహదారి లేకుండా పోయింది. మొత్తం 9 కిలోమీటర్ల దూరంలో 2 కిలోమీటర్ల మేర ఆటంకాలు ఏర్పడ్డాయి మధ్యలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి రోడ్డు వేయకుండా కొంతమంది అడ్డు పడ్డారు. హైడ్రా ప్రజావానికి ఫిర్యాదు అందడంతోనే రంగంలోకి దిగి విచారించి ఆక్రమణలను తొలగించింది. దీంతో జీహెచ్ఎంసి రోడ్డు వేయడం మొదలు పెట్టింది. 60 గీతల రోడ్డు కు లైన్ క్లియర్ అవ్వడంతో స్థానికంగా వున్న నివాసితులు బుధవారం థాంక్స్ టు హైడ్రా అని అనందం వ్యక్తం చేశారు.

ఇచ్చిన హామీలు అమలు చేయని రేవంత్ ఏ ముఖం పెట్టుకొని జూబ్లీహిల్స్‌లో ఓట్లు అడుగుతున్నారు. తులం బంగారం, నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు అడిగితే రేవంత్ ఫ్రీ బస్సు అంటున్నారు. అటు కేసీఆర్ పాలనలో పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు రాలేదు. ఆయన కుటుంబీకులు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు.

- జూబ్లీహిల్స్‌ప్రచారంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ప్రాంతీయం

చేవెళ్ల బస్సు ప్రమాదం మరవక ముందే
మరో బస్సు ప్రమాదం

- పటాన్ చెరు సమీపంలో ఘటన
- క్షణంలో తప్పన ప్రమాదం
- ప్రమాద సమయంలో 20 మంది ప్రయాణికులు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 5 : సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు జాతీయ రహదారి 65 పై ముత్తంగి గ్రామ సమీపంలో ముందు ఉన్న కార్లను తప్పించబోయి బ్రేక్ పడకపోవడంతో బస్సు డ్రైవర్ డివైడర్ ఎక్కించి కరెంట్ స్ట్రీట్ లైట్ స్తంభానికి ఢీ కొట్టారు. ఈ బస్సులో 20 మంది ప్రయాణికుల వరకు ఉన్నారు. బుధవారం మేడ్చల్ డిపోకు చెందిన ఈ బస్సు, మేడ్చల్ నుండి బాలానగర్ మీదుగా ఇస్నాపూర్ వెళ్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ బస్సుకు డ్రైవర్ లక్ష్మయ్య, కండక్టర్ లక్ష్మయ్యలు విధులు నిర్వహిస్తున్నారు. బస్సు ప్రయాణికులకు ఎవ్వరికి ఏం కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చు కున్నారు. సంఘటన స్థలానికి పటాన్ చెరు పోలీసులు చేరుకుని ప్రమాదానికి గల కారణాలను డ్రైవర్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసులు క్రేన్ సహాయంతో బస్సును పక్కకు జరిపి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

శివనామ స్మరణతో మార్మోగిన బీరంగూడ గుట్ట శివాలయం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 5: అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ గుట్ట శ్రీ భ్రమరాంబిక సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. బుధవారం ఉదయం నుంచే ఆలయ ఆవరణలో భక్తులు దీపాలు వెలిగిస్తూ మొక్కులు తీర్చుకుంటున్నారు. కార్తీక పౌర్ణమిని అత్యంత ప్రీతికరమైన రోజుగా భక్తులు భావిస్తారని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం చైర్మన్ బైసా సుధాకర్ యాదవ్, ఈవో శశిధర్ గుప్తా, ఆలయార్చకులు తెలిపారు. దేవాలయంలో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తూ శివనామ స్మరణతో ఆలయం మారుమోగింది.

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 5: కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి, అభిషేకాలు జరిపి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం ప్రాధాన్యతను పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం

- డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ వ్యక్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్య
- పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించిన పోలీసులు

ప్రతిపక్షం, కుషాయిగూడ, నవంబర్ 5: పోలీసుల తీరుపై ఆగ్రహంతో వంటిపై పెట్రోల్ పోసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడాకు చెందిన మీన్ రెడ్డి (32) సోమవారం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పోలీసులకు దొరికాడు. పోలీసులు పెట్టిన బ్రీత్ అనలైజర్ లో 120 రీడింగ్ నమోదు రావడంతో పోలీసులు అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. మనస్తాపానికి గురైన మీన్ రెడ్డి మంగళవారం అర్ధరాత్రి మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ ముందు తనవేంట తెచ్చుకున్న పెట్రోల్ ను తనవంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. ఘటనను గమనించిన స్థానికులు, పోలీసులు మీన్ రెడ్డిని దగ్గరలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మీన్ రెడ్డి చనిపోయాడని డాక్టర్లు నిర్ధారించండంతో మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. కుటుంబసభ్యులు మాత్రం తన కుమారుడు పోలీసులు వేధిస్తేనే మనస్తాపనికి గురై ఆత్మహత్యకు పాల్పాద్దాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే మూడు దశాబ్దాలూ వెక్టర్ డేటాబేస్‌లదే

- గీతం ఆతిథ్య ఉపన్యాసంలో పేర్కొన్న మాజీ ప్రొఫెసర్ సి.రాఘవేంద్రరావు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 5: రాబోయే మూడు దశాబ్దాలు వెక్టర్ డేటాబేస్ లకు చెందుతాయని, అభివృద్ధి చెందుతున్న డేటా ప్రపంచంలో అందుకు అనుగుణంగా ఉండటానికి గణితంపై పట్టు సాధించాలని హైదరాబాదు విశ్వవిద్యాలయం పూర్వ ప్రొఫెసర్ సి.రాఘవేంద్రరావు సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణితం, గణాంకాల విభాగం ఆధ్వర్యంలో 'వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో డేటా సైన్స్ పాత్ర' అనే అంశంపై బుధవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ప్రొఫెసర్ రావు సైన్స్ యొక్క సారాంశం, గణితం యొక్క పాత్ర, డేటా ఆధారిత సమస్య పరిష్కారానికి పెరుగుతున్న ఔచిత్యం గురించి ఆలోచించమని విద్యార్థులను ప్రేరేపించారు. 'అవసరం ఆవిష్కరణకు తల్లి' అని చెబుతూ, ట్రాఫిక్ అంచనాలు, మౌలిక సదుపాయాల ప్రణాళిక, నిర్ణయం తీసుకోవడం వంటి సంక్లిష్ట సవాళ్లను గణిత మోడలింగ్, డేటా సైన్స్ ఎలా పరిష్కరించగలవో ఆయన వివరించారు. శాస్త్రీయ నమూనాల పరిణామం, అంతర్ విభాగ నైపుణ్యాల ప్రాముఖ్యత, డేటా విశ్లేషణలో గణిత కఠినత యొక్క ఆవశ్యకత గురించి ప్రొఫెసర్ రావు చర్చించారు. డేటా శాస్త్రవేత్తలకు అవసరమైన నైపుణ్యాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఓపెన్‌మైండెడ్ నెస్, మోడలింగ్, కమ్యూనికేషన్, విజువలైజేషన్, ఆప్టిమైజేషన్ పద్ధతుల విలువను వివరించారు. వాస్తవ ప్రపంచ సవాళ్లు, విశ్లేషణాత్మక పరిష్కారాల మధ్య వారధిగా గణిత నమూనా తయారీ యొక్క ప్రాముఖ్యతను ప్రొఫెసర్ రావు నొక్కి చెప్పారు. పరిశోధనా ఫలితాలలో ధ్రువీకరణ, స్థిరత్వం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, రాబోయే మూడు దశాబ్దాలు వెక్టర్ డేటాబేస్ లదే అని పునరుద్ఘాటించారు. ఎంఎస్సీ డేటా సైన్స్ విద్యార్థులు చిన్న పరిశోధన ప్రాజెక్టులను చేపట్టాలని, ఆవిష్కరణ, వ్యవస్థాపకతకు అవకాశాలను గుర్తించడానికి భారతదేశం యొక్క విజన్ డాక్యుమెంటు 2047ను అధ్యయనం చేయాలని ఆయన ప్రోత్సహించారు. తొలుత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి అతిథిని స్వాగతించగా, ప్రొఫెసర్ బీ.ఎం.నాయుడు, డాక్టర్ జాదవ్ గణేష్ ప్రొఫెసర్ రాఘవేంద్రరావును సత్కరించారు.

కీసర గుట్టలో పారిశుధ్య లోపం

- కనిపించని శానిటేషన్ సిబ్బంది
- శివలింగాలకు అభిషేకం చేసిన పాలు తొక్కుంట వెళ్తున్న భక్తులు

కీసర గుట్టలో ఏరులై పారుతున్న అభిషేకం చేసిన పాలు

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 5: కీసర గుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయం బయట శానిటేషన్ సిబ్బంది కనిపించకుండా పోయారని భక్తులు వాపోతున్నారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా కీసర గుట్టకు ఉదయం నుండే భక్తులు పోతేట్టారు. ఆలయం బయట ఉన్న శివలింగాల వద్ద పారిశుధ్య లోపం కనిపిస్తుందని, ఎందుకంటే భక్తులు శివలింగాలకు తెచ్చిన పాలు, పెరుగు పంచామృతాలతో అభిషేకం చేసే క్రమంలో ప్లాస్టిక్ కవర్స్ ఎక్కడ పడితే అక్కడే పడేశారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయవలసిన శానిటేషన్ సిబ్బంది మధ్యాహ్నం అనంతరం అలాగే వదిలేశారు. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు సిబ్బంది కొరత ఉండేదని, ఇప్పుడు మున్సిపాలిటీ అయిన సిబ్బంది కొరత ఉందా, లేదా అధికారుల నిర్లక్ష్యం ఉందా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. భక్తులు శివలింగంపై పోసిన పాలు పెరుగు అంత రోడ్డుపైనే ఏరులై పారుతుందని వాపోతున్నారు. స్వామి వారికి అభిషేకం చేసిన పాలు భక్తులు తొక్కుంట పోవడం మంచిది కాదని, భక్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అభిషేకం చేసిన పాలు పైపుల ద్వారా బయటకు పోయేలా చేయాలని, అప్పటి జిల్లా కలెక్టర్ ఎంవి రెడ్డి సూచించారన్నారు. అధికారులు సూచించిన ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళిక చేపట్టలేదని భక్తులు ఆలయ అధికారులపై మండి పడుతున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు చొరవ చూపి శివలింగాల వద్ద అభిషేకం చేసిన పాలు పైప్ లైన్ ద్వారా బయటకు వెళ్లేలా చేయాలని కోరుతున్నారు.

కీసరలో బందోబస్తు పరిశీలించిన రాచకొండ సీపి

ప్రతిపక్షం, కీసర, నవంబర్ 5: భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు అన్నారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా మేడ్చల్ జిల్లా కీసర లోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూసుకోవాలని పలు సూచనలు చేశారు..

యువ నాయకుడు రుశ్వంత్ రెడ్డి ఆధ్వర్యంలో
ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 5: అమీన్ పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి నివాసంలో ఆయన కుమారుడు, యువ నాయకుడు తుమ్మల రుశ్వంత్ రెడ్డి కన్నె స్వామి ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి బుధవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. వందలాదిమంది అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో పూజ స్థలం మారుమోగింది. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాములందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని అయ్యప్ప స్వాములు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లు విసిరి పారిపోవడం కేటీఆర్ కు అలవాటే. ఆయన విసిరే సవాళ్లను కాంగ్రెస్ కార్యకర్తలు కూడా పట్టించుకోరు. కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఇచ్చిన నిధులపై జీవోలు ఇస్తాం. కేటీఆర్ రాజీనామాకు సిద్ధంగా ఉండాలి. రాష్ట్రానికి కేంద్ర నిధులు రాకుండా కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారు.
- సీఎం రేవంత్‌రెడ్డి

ప్రాంతీయం

కార్మికుల నడ్డి విరుస్తున్న లేబర్ కోడ్‌లు

- సీఐటీయూ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి
- రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్కరాములు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, అక్టోబర్ 5:- కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోర్డులు అమలు కాకముందే రాష్ట్రంలో కొన్ని పరిశ్రమలు కార్మికుల నడ్డి విరిచేలా వ్యవహరించడం సిగ్గుచేటని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్కరాములు అన్నారు. బుధవారం మెదక్ ప్రజా సంఘాల కార్యాలయం కేవల్ కిషన్ భావన్ లో మహాసభల నిర్వహణ కోసం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు అమలు చేయకపోను, ఇప్పుడు ఉన్న బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదరులకు అనుగుణంగా వ్యవహరిస్తూ లేబర్ కోర్డులు తీసుకువచ్చిందని గుర్తుచేశారు. కార్మిక సంఘాలు పోరాటాలతో అందులో ప్రధాన పాత్ర సీఐటీయూ పోరాటంతో లేబర్ కోర్డు అమలు కాకుండా ఆపగలిగామని గుర్తుచేశారు. ఈ మధ్యకాలంలో సంగారెడ్డి జిల్లా ఇండస్ట్రియల్ ఏరియాలో ఓ పరిశ్రమలో యూనియన్ ఏర్పాటు చేస్తే కార్మిక చట్టలకు వ్యతిరేకంగా యాజమాన్యం కార్మికులను సస్పెండ్ చేయడం దూర్మార్గం అన్నారు. కార్మికుల కష్టానష్టాలు, వారి హక్కుల కోసం యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు కార్మికులకు ఉన్నపటికీ యూనియన్ ఏర్పాటు చేసారనే కారణంతో యూనియన్ ప్రధాన కార్యదర్శి తో పాటు 5 మందిని సస్పెండ్ చేసి మిగతా 35 మందికి నోటీసులు ఇవ్వడం బీజేపీ తెచ్చిన నూతన లేబర్ కోర్డు లో భాగమేనని గుర్తుచేశారు. ఇప్పటికైనా కార్మిక వర్గం కేంద్రం తెస్తున్న కార్మికవ్యతిరేక విధానాలను ఇందాకట్టడం కోసం ఐక్యం కావాలని కోరారు. మెదక్ పట్టణ కేంద్రంగా నిర్వహిస్తున్న తెలంగాణ సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలు డిసెంబర్ 7,8,9 తేదీలలో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎంగడుతూ భవిష్యత్తు ఉద్యమాలకు ఊపిరిగా ఈ మహాసభలు జరగబోతున్నాయని, ఈ మహాసభలు జయప్రదానికి కార్మికులు, కర్షకులు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం వైస్ చైర్మన్ అడివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు బాలమణి, మల్లేశం కోశాధికారి నర్సమ్మ, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, కదారి నాగరాజు, బస్వరాజు సహాయ కార్యదర్శి సంతోష్, నాయకులు మల్లేశం, బాబు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దీప ప్రతిమలతో 'లింగా' కృతి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 6: కార్తీక పౌర్ణమి సందర్భంగా మునిసిపల్ కేంద్రంలోని ప్రజ్ఞాపూర్ పార్థీవేశ్వర స్వామి సన్నిధిలో బుధవారం నాడు దీపోత్సవం నిర్వహించారు. భక్తులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో శివలింగాకృతిలో దీపాలు వెలిగించి ఆలయాన్ని శోభాయమానంగా మార్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉప ఎన్నిక ప్రచారంలో శ్రీకాంత్ రావు

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 5: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా బుధవారం నాడు గజ్వేల్ నివాసి, ఏఐసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రావు ఓటర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే బీద, బడుగు, బలహీన, వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒకటి ఒకటిగా అమలు చేస్తూ పేద ప్రజల గుండెల్లో గూడు కట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి నాయిని యాదగిరి, ఆత్మ కమిటీ చైర్మన్ బయ్యారం మల్లారెడ్డి, డైరెక్టర్ బాబా, మాజీ సర్పంచ్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నగర్ స్నేహ అసోసియేషన్

అధ్యక్షుడిగా విష్ణువర్ధన్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, నవంబర్ 5: సిద్దిపేట పట్టణంలోని ఆదర్శ నగర్ స్నేహ అసోసియేన్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నూతన అధ్యక్షుడిగా పరకాల విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బేతి గంటి మధుసూదన్ గౌడ్, కోశాధికారిగా అశోక్ గౌడ్, సలహాదారులుగా ఎల్లంకి భూపాల్ రెడ్డి, కె.యాదగిరి, పి.అంజిరెడ్డి, ఎం.ఎలయ్య, ఎ.రవీందర్ రెడ్డి, వి.రాజిరెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యులుగా సిహెచ్ రమేశ్ డి.పర్శరాములు, సిహెచ్ అంజయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఆదర్శ నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అసోసియేషన్ సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతామని వివరించారు.

గజ్వేల్లో గుడి దొంగల ముఠా అరెస్ట్

గజ్వేల్, ప్రతిపక్షం, నవంబర్ 5: వర్గల్, రాయపోల్ మండలాల్లో ఇటీవల గుడి తాళాలు పగులకొట్టి గుడి గంటలు, చెంబులు, హుండీల డబ్బులు దొంగిలించిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నమ్మదగిన సమాచారం ఆధారంగా వర్గల్‌లో కల్లు దుకాణం వద్ద ముగ్గురు దొంగలు పర్వతం నర్సింహులు (35), తూర్పాటి వంశీ (20), నూనె సంపత్ (15) లను, అలాగే దొంగ వస్తువులు కొనుగోలు చేసిన కూరాకుల ఆంజనేయులు (30)ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి టీవీఎస్ మోపెడ్, ఇత్తడి గంటలు, చెంబు, ప్లేట్, మాణిక్యాలు, రాగి సామానులు మరియు నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పలు పాత దొంగతన కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ ఏసిపి నర్సింలు తెలిపారు.

పరమశివుని నామస్మరణతో కార్తీక శోభ

- ఇంటి ముంగిట్లో, ఆలయాల్లో దీపోత్సవాలు

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 5: కార్తీక మాసం సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. పరమశివుని నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. ఉదయం సాయంత్రం వేళలో నది స్నానాలు అలయాల వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. మహిళలు, దంపతులు తులసి మాత వద్ద ఉసిరి దీపాలతో హారతులిచ్చి పూజలు చేపట్టారు. నివాస ద్వారాల ముందు దీప కాంతులు విరజీమ్మాయి. ఇంటి గుమ్మాలకు పువ్వుల అలంకరణతో శోభాయమానంగా తులసి మాత పూజలు నిర్వహించారు. ఇంటి ముంగట్లో టపాసులు పేల్చి తీపి వంటలతో ఆనందోత్సవాలు జరుపుకున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 5: ట్రాఫిక్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు మెదక్ పట్టణ సీఐ మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ప్రకారం మెదక్ పట్టణంలో చంద్ర భవన్ హోటల్ ఎదురుగా మెయిన్ రోడ్ పై ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కనకరాజు అనే ట్రాఫిక్ కానిస్టేబుల్ వద్దకు ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వచ్చి దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారు. ఈ విషయంలో కనకరాజు ఇచ్చిన ఫిర్యాదు మెరకు మెదక్ మండలం శివాయపల్లికి గ్రామానికి చెందిన యువకులు కొత్తపల్లి మహిపాల్, బండారి పవన్ యువకులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ మహేష్ వెల్లడించారు. పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని సీఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.

హరీష్ ను పరమర్శించిన బీఆర్ఎస్ శ్రేణులు

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 5: మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు మరణించడంతో ఆ కుటుంబ సభ్యులను దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి తో పాటు చేగుంట మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరమర్శించారు. ఈ కార్యక్రమంలో చేగుంట బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నారాయణరెడ్డి, మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు మంచికట్ల శ్రీనివాస్, నాయకులు రంగయ్య గారి రాజిరెడ్డి, రాజగోపాల్, మహమ్మద్ అలీ, తానేష, సుదర్శన్, సుభాష్ రెడ్డి, నాగరాజు, శ్రీకాంత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీబీఎఫ్ జిల్లా అధ్యక్షులు సంజీవ్ కు పరామర్శ

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 5: సిద్దిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత బహుజన ఫ్రంట్ మెదక్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్ తండ్రిని బుధవారం దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, జిల్లా నాయకుడు దుబాసి చంద్రయ్యతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు సంజీవ్ కుటుంబ సభ్యులను ధైర్యంగా ఉండాలని, సంజీవ్ తండ్రి త్వరగా ఆరోగ్యవంతంగా కోలుకోవాలనే ఆకాంక్ష వ్యక్తం చేశారు.



తన్నీరు మహేష్ రావుకు శ్రీనివాస్ గౌడ్ పరామర్శ

ప్రతిపక్షం సిద్దిపేట, టౌన్, నవంబర్ 5: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు ఇటీవల మరణించడం పట్ల హరీష్ రావు తమ్ముడు మహేష్ రావుని సిద్దిపేట బీఆర్ఎస్ నాయకులు మరుపల్లి శ్రీనివాస్ గౌడ్ పరామర్శించారు. సత్యనారాయణ రావు చిత్రపటానికి నివాళులు అర్పించారు.

దీపాల కాంతుల్లో మెరిసిన నాచగిరి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 5: బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో భక్తులు వెలిగించిన దీపాల కాంతులతో ఆలయ ప్రాంగణం ధగధగా మెరిసింది. అశేష సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం 224 మంది భక్తులు జరిపిన సత్యనారాయణ స్వామి వ్రతాలు ఐదు పర్యాయాలు జరిపించారు. కార్యనిర్వహణాధికారి వి. విజయ రామారావు, దేవాలయ చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా, ధర్మకర్తలు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు రుద్ర శ్రీహరి, కొత్తపల్లి శ్రీనివాస్, సిబ్బంది సుధాకర్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

305 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ (నర్సాపూర్), 5: అక్రమ రేషన్ బియ్యంతో వెళ్తున్న లారీని పోలీసులు పట్టుకున్న సంఘటన నర్సాపూర్ పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం విజిలెన్స్ అధికారుల కళ్లుగప్పి హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు 305 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లారీలో తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు నర్సాపూర్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించామని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో నర్సాపూర్‌లోకి లారీ ప్రవేశించగానే లారీని పట్టుకన్నామని వెల్లడించారు. లారీ డ్రైవర్, క్లీనర్‌తో సహా 305 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులకు అప్పగించామని వివరించారు. లారీలో ఉన్న బియ్యాన్ని సివిల్ సప్లై గోదాంకు తరలించామని పేర్కొన్నారు.

“

గత ఏడాది కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి రూ.1000 కోట్ల విరాళాలు వచ్చాయి. శ్రీవాణి ట్రస్ట్ కింద 5వేల ఆలయాలు నిర్మించాలని తీర్మానించాం. తిరుపతి--తిరుమల మధ్య ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని యోచిస్తున్నాం. తిరుపతి విమానాశ్రయానికి శ్రీవెంకటేశ్వర ఎయిర్‌పోర్టుగా నామకరణం చేస్తాం.
- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ప్రాంతీయం

ఏడుపాయలలో ఘనంగా కార్తిక దీపోత్సవం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, అక్టోబర్ 5: తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత ఆలయంలో కార్తీక శోభా సంతరించుకుంది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అమ్మవారి ఆలయం ముందు మంజీరా నది పారుతుండడంతో రాజగోపురంలో ఉత్సావ విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్నారు. తెల్లవారుజాము నుండి ఆలయం చుట్టూ పొగ మంచు కమ్ముకుంది. కార్తిక పౌర్ణమి సందర్భంగా మహిళలు దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు రావడం దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొనడంతో ఏడుపాయల మొత్తం పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్తీక మాసం పరిష్కరించుకొని వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఏడుపాయల ప్రాగణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పౌర్ణమి చంద్రుని వెన్నెల్లో వన దుర్గమ్మ

- ఏడుపాయలలో వైభవంగా అమ్మవారి పల్లకి సేవ

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, అక్టోబర్ 5: మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా మాత క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమి నాడు నిర్వహించే విధంగానే బుధవారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, రాజగోపురం నుంచి పల్లకి సేవ ప్రారంభమై, శివాలయం వరకు కొనసాగింది. అమ్మవారి ప్రాంగణం దుర్గమ్మ నామస్మరణతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 5: సిద్దిపేట పట్టణంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా కోటిలింగేశ్వర ఆలయం, శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి దేవాలయలలో భక్తుల రద్దీగా కొనసాగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు విరివిగా తరలి వచ్చి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం దీపాలతో కాంతులీనాయి. ఆలయ ప్రాంగణాలు భక్తి పారవశ్యంతో నిండిపోయాయి.

శిశుమందిర్‌లో కార్తీక పౌర్ణమి గీత యజ్ఞం

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 5 : హుస్నాబాద్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో కార్తిక పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం సరస్వతీ మాత పూజతో ప్రారంభమై, గీత యజ్ఞంతో ముగిసింది.ఈ యజ్ఞాన్ని పాఠశాల ప్రధానాచార్యులు పాలరాం శ్రీలత దంపతులు, పోషకులు మెట్టపల్లి కరుణాకర్ దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి అశోక్ , పాఠశాల అధ్యక్షులు గౌరిశెట్టి ప్రకాష్, కార్యదర్శి బబ్బుల రవీందర్ , ప్రబంధకారిణి సభ్యులు మాడిశెట్టి హేమలత , ఆచార్యులు, మాతాజీలు, పోషకులు, హితైషులు, విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సత్యనిష్ట నెలకొనాలని సత్యనారాయణస్వామి వ్రతం

- అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు గుప్త

ప్రతిపక్షం, చేర్యాల, అక్టోబర్ 5: చేర్యాల మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, అష్టలక్ష్మి పూజాలో విశేషమైన భక్తజనం మధ్య అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకొని సామూహిక కుంకుమార్చన, కలశ స్థాపన, గణపతి పూజ, శ్రీ రమాసమేతా సత్యనారాయణ స్వామి వ్రతం, నవ విధాభిషేకం, నవగ్రహ పూజలు, అష్టదిక్పాలక పూజలు, పంచలోకపాలక పూజలు, వేద మంత్రోచ్ఛరణాల మధ్య దేశపతి రామచద్రం శర్మ ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 41 మంది జంటలు పాల్గొన్నాయి.ఈ సందర్బంగా ఆలయ కమిటీ అధ్యక్షులు తాటిపెల్లి ఆంజనేయులు గుప్త మాట్లాడుతూ సమాజంలో సత్యనిష్ట నెలకొనాలని సత్యనారాయణస్వామి సామూహిక వ్రతం చేపట్టినట్లు తెలిపారు. వేద మంత్రోచ్ఛణల॥ మధ్య సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, శ్రీ తులసి దామోదర కళ్యాణం తోపాటు సహస్ర దీపోత్సవం నిర్వహించగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజ కార్యక్రమాలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు తీర్ద ప్రసాదలతో పాటు అన్న ప్రసాదం అందజేశారు.

కేంద్రమంత్రి లలన్ సింగ్ పై కేసు నమోదు చేయాలి

- తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 5: పేద ప్రజలను పోలింగ్ బూతుల దగ్గరికి రానివ్వకండని కేంద్రమంత్రి లలన్ సింగ్ అనడం రాజ్యాంగాన్ని అవమానపరచడమే అని, ఆయనపై తక్షణమే కేసు నమోదు చేసి, రాబోయే ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని, మంత్రి పదవి నుంచి తొలగించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ అన్నారు. హుస్నాబాద్ లో తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా చెప్యాల ప్రకాష్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో అంబేద్కర్ ఆలోచన విధానాన్ని, సిద్ధాంతాన్ని గ్రామ గ్రామాన ప్రచారం చేసి అంబేద్కర్ సంఘంను బలోపేతం చేయాలని కోరారు. రాబోయే నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ గ్రామాన మండల కమిటీల నిర్మాణం చేసి రాజ్యాంగాన్ని రక్షించుకుందాం అని అన్నారు అదే విధంగా ర్యాలీలు ప్రతిజ్ఞలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి తొందూరి ఎల్లన్న బహుజన్, రాష్ట్ర కార్యదర్శి కండే సుధాకర్, హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు చింతకింది శంకర్, హుస్నాబాద్ మండల అధ్యక్షులు బెజ్జంకి బాబు, అక్కన్నపేట మండల ఉపాధ్యక్షులు జాల రవీందర్ , హుస్నాబాద్ మండల సీనియర్ అంబేద్కరీస్ట్ బత్తుల రవీందర్, అక్కన్నపేట మండలం సీనియర్ నాయకులు కోడముంజ బాలరాజ్, మహిళా నాయకురాలు మొలుగూరి సునీత , బీసీ నాయకులు వేముల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి

ప్రతిపక్షం, చేర్యాల, అక్టోబర్ 5: చేర్యాల మండలంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో తిరునామాలు, ఓంకారం, స్వస్తిక్ గుర్తులుగా గుడి అంతా సహజ దీప కాంతులతో కార్తీక దీపం ఆకాశ దీపం ఆవిష్కరించారు. సుమారు సహస్ర దీపాలంకరణతో స్వామిని అర్చించారు. కార్తీక పురాణం, భజనలు, తీర్థ ప్రసాదాలతో పారాయణలతో వైదిక పూజలు రాజు స్వామీ శేషాచార్యులు నిర్వహించారు. సరోజని, పద్మ, రేణుక, శ్రీనివాసరెడ్డి, విజయ, హరిన, గీత, గోవర్ధన్, భక్తులు సుమారు 200 మంది పాల్గొన్నారు.

వెంకట్రావుపేటలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ప్రతిపక్షం, తొగుట, నవంబర్ 5: కార్తీక పౌర్ణమి సందర్భంగా తొగుట మండల కేంద్రంలోని వెంకట్రావుపేట గ్రామంలో గల శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవాలయంలో ఆలయ మహిళా కమిటీ చైర్మన్ రాయారావు అరుణరఘుపతి రావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రామకృష్ణా చార్యుల నేతృత్వంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించడం జరిగింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా వేకువ జామున పెద్ద ఎత్తున భక్తులు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు దీపారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం జరిగిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య అతిధులు గా హాజరైన టి కృష్ణ వెంకటలక్ష్మి లను మహిళా కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

సంపూర్ణ ఆరోగ్యంతో ఏదైనా సాధించగలం

- వైద్యులు చెరుకు శ్రీనివాస్, దీపాంజలి
- ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రతిపక్షం, చేర్యాల, అక్టోబర్ 5: మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో చేర్యాల వెంకటసాయి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వెంకటసాయి హస్పాటల్ వైద్యులు సీహెచ్ శ్రీనివాస్, దీపాంజలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఎముకల, చర్మ తదితర వైద్యం శిబిరానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. సుమారు 328 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించిన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు శ్రీనివాస్, దీపాంజలి మాట్లాడుతూ.. ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఈ మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి ముందస్తుగా రోగనిర్ధారణ జరగడంతోపాటు జాగ్రత్తల గురించి వైద్యులు అవగాహన కల్పించారు. అవసరమైన వారికి సర్జరీలు, అన్ని రకాల ఇన్సూరెన్స్ పాలసీలు, ఆరోగ్యశ్రీలో చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలమని సూచించారు. వెంకటసాయి హాస్పిటల్ తరపున కొన్ని సంవత్సారాలుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో వెంకటసాయి హాస్పటలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా ఎనిమిది జిల్లాల ఏర్పాటుకు పలు వర్గాల నుంచి సూచనలు వచ్చాయి. అలాగే కొత్త రెవెన్యూ డివిజన్ల కోసమూ వినతులు అందాయి. పాలనా సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొనే వీటిపై నిర్ణయం ఉంటుంది. సీఎం సూచనతో అల్లూరి(డీ)లో ప్రత్యేక అభివృద్ధి మండలి ఏర్పాటుపై ఆలోచనలు చేస్తున్నాం. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో అక్రమాలపై చర్యలు తప్పవు.

- ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్

ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని తనిఖీ చేసిన డిఎంహెచ్వో

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 5: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కొనసాగుతున్న 8 ఆరోగ్య మహిళా కేంద్రాలను జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ బి రాజశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం నిజామాబాద్ నగరంలోని సీతారామనగర్ కాలనీ పట్టణా ఆరోగ్య కేంద్రం లో డీ ఎం హెచ్ ఓ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ మహిళా ఆరోగ్యమే ప్రధాన ధ్యేయంగా మహిళలు ప్రధానంగా ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి స్త్రీ వైద్య నిపుణుల చేత నిర్ధారణ పరీక్షలు, చికిత్స అందించి, మహిళలను శారీరకంగా మానసికంగా ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దుతూ వారి ద్వారా కుటుంబాన్ని మెరుగుపరిచేలా చూడడమే ప్రధాన ధ్యేయమన్నారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికలను, రికార్డ్స్,రిపోర్ట్స్ ను, ఐ ఎల్ ఆర్, టీకాలు భద్రపరిచే డీప్ ఫ్రీజర్, మందుల నిల్వను పరిశీలించారు. సిబ్బంది అందరూ సమయపాలన పాటిస్తూ వారి వారి విధులను సక్రమంగా నిర్వహించాలని, వారికి కేటాయించిన లక్ష్యాలను నిర్దేశించిన సమయంలోనే 100శాతం పూర్తి చేయాలని, నియమ నిబంధనలను ఉల్లంఘించి విధులకు హాజరు కాని వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రత్యూష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు ఉండకూడదు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 5:- జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కోల్చారం మండల పరిధిలోని సంగయ్య పేట గ్రామా పరిధిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కలెక్టర్ స్వయంగా తేమశాతాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చిన వెంటనే సీరియల్ నెంబర్ల వారీగా ఎంత ధాన్యం తెచ్చారు, ధాన్యం తేమ తెచ్చిన రోజు ఎంత ఉంది అనే వివరాలు రిజిస్టర్లలో నమోదు చేసుకోవాలని తెలిపారు. నిర్దేశించిన తేమ శాతం వచ్చిన వెంటనే కేటాయించిన మిల్లుకు ధాన్యాన్ని వెంటనే లోడ్ చేసి పంపించేయాలని సూచించారు. ఇక వరి కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు సన్న రకం వరి ధాన్యాన్ని, దొడ్డు రకం వరి ధాన్యాన్ని గుర్తించడంలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు

34,520 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. గతంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన వారు మాత్రమే కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉన్న కొల్చారం తహసిల్దార్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నింబాద్రి గుట్ట పై అన్ని వసతులు కల్పించాలి

- లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకున్న కవిత

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 5 : నిజామాబాద్ జిల్లా భీంగల్ నింబాద్రి గుట్ట పై అన్ని వసతులు కల్పించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. నింబాద్రి గుట్ట శ్రీ లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ ప్రాంతానికి సంబంధించి రాష్ట్రంలో పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, మరో ముగ్గురు కార్పొరేషన్ చైర్మన్లు, కీలకమైన కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. వారు ఈ ఆలయం అభివృద్ధి గురించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నియోజక వర్గం ఎమ్మెల్యే ఎవరన్నది పక్కన పెడితే రూలింగ్ పార్టీదే నడుస్తోందన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భీంగల్ మండలంలోని లింబాద్రి స్వామి ఆలయంలో పెద్ద ఉత్సవం జరుగుతుంది. ఈ స్వామి వారు చాలా పవర్ ఫుల్ దేవుడు. కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి వారి ఆశీస్సుల కోసం వచ్చామన్నారు. నిజానికి లింబాద్రి ఆలయం కాదు, నింబాద్రి చాలా మహిమ గల దేవుడన్నారు. వేప చెట్లు ఉన్నాయని నింబాద్రి అంటారు. కాలక్రమేణా లింబాద్రిగా పేరు వచ్చింది. ఈ దేవుడి దయ వల్ల నిజామాబాద్ ప్రజలు, తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. కేసీఆర్ లక్ష్మీ నరసింహా స్వామి భక్తుడు. గతంలో నింబాద్రి స్వామి వారికి రూ. 5 కోట్లు కేటాయించారు. దాంతో గుడిని అభివృద్ధి చేసుకున్నాం. కాగా మహిళలకు టాయిలెట్స్, ఛేంజింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. గుట్ట కింద అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ పూర్తి కావటానికి రూ. 20 లక్షలు అవసరం. ప్రభుత్వం వాటిని కేటాయించాలని, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక దృష్టి పెట్టి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రైతులు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం పట్టించుకోవటం లేదని, మక్కలు 80 శాతం కొన్న తర్వాత ఇప్పుడు కాంటా పెడుతున్నారు. ఇది దారుణం, అన్యాయమన్నారు. తడిసిన వరి కూడా కొనటం లేదు కొంటామని కూడా చెప్పటం లేదని అన్నారు. ఇటీవల నేను యంచ గ్రామానికి వెళ్లిన తర్వాత కలెక్టర్ ఆ ప్రాంతాన్ని విజిట్ చేసినట్లు తెలిపారు. అలాగే అన్ని చోట్లకు వెళ్లాలని కోరుతున్నా. ఈ ప్రాంతంలోని కొన్ని చెక్ డ్యామ్ లు డ్యామేజ్ అవటంతో బాల్కొండలో పంట పొలాలు నీట మునిగాయి. వారికి పంట నష్టం ఇస్తామని ప్రభుత్వం ధైర్యం చెప్పటం లేదని, ప్రతిపక్షాలు కూడా కనీసం ప్రభుత్వాన్ని నిలదీయక పోవటం దారుణమని అన్నారు. ఇక్కడున్న ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని నిలదీయాలి. రైతులకు మేలు చేసే ప్రయత్నం చేయాలని సూచించారు.

కార్తీక దీపాలలో వెలిగిన ఎములాడ

- కాళేశ్వరంలో కార్తీక మాసం
- ధర్మపురిలో గోదావరి జలాలతో అభిషేకం
- కోటిలింగాలకు పోటెత్తిన భక్తులు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 5: తెలంగాణలోని ప్రధాన ఆలయాలన్ని కార్తీక పౌర్ణమి కాంతులతో వెలిగిపోతున్నాయి. తెల్లవారుజాము నుండే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకొని దీపాలు వెలిగించారు. వేములవాడలోని శ్రీరాజన్న ఆలయంలో భక్తులతో కిటకిటలాడిపోయింది. ఈ కార్తీక పౌర్ణమి రోజున ఏదైనా ఆలయంలో కార్తీకదీపాలు భక్తిశ్రద్ధలతో వెలిగించడం ద్వారా మోక్షం లభిస్తుందని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి ఆలయ అర్చకులు నమిలికొండ రాజేశ్వర్ శర్మ తెలిపారు. కార్తీకదీపాలు వెలిగించి వెలిగించి స్వామివారిని దర్శించుకోవడం ద్వారా ఈ మాసంలో పుణ్య ఫలాలు కార్యసిద్ధి లభిస్తుందని అన్నారు. మిగతా మాసాలతో పోల్చుకుంటే కార్తీక మాసం విశిష్టమైనదన్నారు.

కాళేశ్వరంలో కార్తీక మాసం

కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. ఈ పవిత్ర మాసంలో, ముఖ్యంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా, ఆలయాలలో విశేష పూజలు జరుగుతున్నాయి. గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించి, దేవాలయాలలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్నారు. ఆలయ అర్చకులు గోదావరి నుంచి తెచ్చిన నీటితో స్వామివారికి జలాభిషేకం చేస్తున్నారు, ఇది ఆలయానికి ప్రత్యేక శోభను తెచ్చింది. కార్తీక మాసం సందర్భంగా కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తులు గోదావరి నదిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. ఆలయాల్లో దీపారాధనలు, సత్యనారాయణ స్వామి వ్రతాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

ధర్మపురిలో గోదావరి జలాలతో అభిషేకం

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన జగిత్యాల జిల్లా ధర్మపురితో పాటు కోటిలింగాలలోని గోదావరి నది తీరాలకు ఉదయం నుండే భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండే భక్తుల కోలాహలంతో గోదావరి నది తీరంలో పండుగ వాతావరణం నెలకొంది. గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించిన తర్వాత, నది తీరాన ఉన్న శివలింగాలకు గోదావరి జలాలతో అభిషేకం నిర్వహించి, భక్తులు ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం ఎంతో భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించి గోదావరి నదిలో వదిలి మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంతో పాటు, వెల్గటూర్ మండలం కోటిలింగాలలోని శ్రీ కోటేశ్వర స్వామి ఆలయంలో బక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి, స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్ల వద్ద ప్రత్యేక పూజలు చేసి, కార్తీక దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు. గోదావరి పుణ్య స్నానాల కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుండి పెద్దఎత్తున తరలివచ్చి గోదావరి పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. వీటితో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాల్లో కార్తీకమాసం క్షోభ కనిపించింది.

హుస్నాబాద్‌లో వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

- రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఘనంగా దీపోత్సవం
- భక్తుల రద్దీతో దేవాలయ ప్రాంగణం కిటకిట

-ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 5: కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడగా, ఉదయం నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి దీపారాధన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ ముఖ మండపంలో మహాగణపతి పూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, చండీ హోమం, ఆశీర్వచనం, దీపోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించగా, అర్చకులు తాటికొండ పరమేశ్వర్ శర్మ, కొత్తకొండ టి. వినయ్ శర్మ, రవి శర్మ, శ్రవణ్ శర్మ, శశాంక్ శర్మ వేద మంత్రోచ్చరణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో దేవాలయ మాజీ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ గౌడ్-అరుణ దంపతులు అన్నదానం నిర్వహించగా, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య - పుష్ప, రేణుక ఎల్లమ్మ ఆలయ కార్యనిర్వాహణాధికారి పి. కిషన్ రావు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆకుల రజిత -వెంకన్న, మాజీ వైస్ చైర్మన్ ఐలేని అనిత - శ్రీనివాస్ రెడ్డి, చిత్తారి రవీందర్-పద్మ, పచ్చిమట్ల రవీందర్ గౌడ్-సుమలత, పున్న సది పూదరి చంద్రమౌళి, వల్లపు రాజు, పచ్చిమట్ల శ్రీకాంత్ గౌడ్, పెరుమాండ్ల నర్స గౌడ్, దేవాలయ సిబ్బంది నీల కుమారస్వామి, పున్న హనుమంతు, గీ కురు రమేష్, వీర రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోకుంటే రద్దు

- కలెక్టర్ గరిమ అగర్వాల్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 5: అర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల ఆర్థిక సాయాన్ని వినియోగించుకొని నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఇల్లంతకుంట లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లును పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో లబ్ధిదారులు తమ కలల ఇంటిని పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోకుంటే రద్దు చేయండని కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్శనలో గృహ నిర్మాణ శాఖ పీడీ శంకర్, ఎంపీడీఓ శశికళ, తదితరులు ఉన్నారు.

ఘనంగా మన్నింభచల లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం

- స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 5 : ఉత్తర తెలంగాణ లో ప్రసిద్ధి గాంచిన భీమ్గల్ శ్రీ మన్నింభచల లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం, జాతర బుధవారం కన్నులపండువగా జరిగింది. ప్రతి సంవత్సరం కార్తీక మాసం పున్నమి రోజు స్వామి వారిని రథం పై ఉంచి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నాలుగు రాష్ట్రాల నుండి లక్షల సంఖ్యలో భక్తులు జాతరలో పాల్గొన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్వామి వారిని దర్శించుకున్నారు.

వైభవంగా ఏనే మల్లికార్జున స్వామి కళ్యాణం

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 5 : కార్తీక పౌర్ణమి సందర్భంగా హుస్నాబాద్‌లోని ఏనే మల్లికార్జున స్వామి దేవాలయంలో కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఏనే మల్లికార్జున స్వామి, బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మ గార్ల కళ్యాణాన్ని పెద్దపట్నం వేస్తూ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకను భక్తులు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. తెలంగాణకు ప్రత్యేకమైన శైవ సంప్రదాయమైన "మల్లన్న పట్నాలు" ఈ సందర్భంలో వేయడం విశేషం. ఈ పూజా విధానం తెలంగాణ గ్రామాల్లో శైవ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుంది. ప్రతి మూడు లేదా ఐదు సంవత్సరాలకు మల్లన్న స్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించి, భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటారని దేవాలయ నిర్వాహకులు తెలిపారు. కార్తీక పౌర్ణమి కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై దైవదర్శనం చేశారు. ఈ కార్యక్రమాన్ని దేవాలయ వ్యవస్థాపకులు మేకల పద్మ, చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో దేవాలయ కమిటీ విజయవంతంగా నిర్వహించింది.

అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం

- సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి లింగన్న

ప్రతిపక్షం, తొర్రూరు, నవంబర్ 5: సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నవంబర్ 1 నుంచి 9 వరకు అమరవీరుల వర్ధంతి సభల వారోత్సవంలో భాగంగా దంతాలపల్లి మండలంలోని పడమటి గూడెం స్టేజి వద్ద కామ్రేడ్ జక్కుల ఐలన్న స్మారక స్థూపంపైన పార్టీ డివిజన్ కార్యదర్శి ఉడుగుల లింగన్న జెండానుఎగురవేశారు. అనంతరం చిర్ర యాకయ్య అధ్యక్షతన సంస్మరణ సభను ఉద్దేశించి సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న, చిర్రా యాకన్నలు మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, ఈ దేశం విముక్తి కోసం ఎందరో వీరులు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా పీడత ప్రజల కోసం అర్పించారని, వీరుల త్యాగాలని మననం చేసుకుంటూ, వారి ఆశయ సాధనలో కంకణ బద్ధులమై పోరాడాలని పిలుపునిచ్చారు. గోదావరి పరివాహక ప్రాంతంలో దున్నేవానికి భూమి కావాలని 11 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిన చరిత్ర విప్లవకారులదని, వారి అసమాన త్యాగాలతో గోదావరి లోయ నెత్తుటి సాక్షాలుగా నిలిచి సాధించి పెట్టిందని గుర్తు చేశారు. కామ్రేడ్స్ చంద్ర పుల్లారెడ్డి, తరిమిల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, చారు మజుందార్ వీరితో పాటు అనేకమంది కామ్రేడ్స్ నక్సల్ బరి, శ్రీకాకుళం మూషహరి గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలో అనేక మంది అమరులయ్యారని అన్నారు. అమరుల త్యాగాలను పునికిపుచ్చుకొని, వారి ఆశయ సాధనలో పునరంకితం అవుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు, చిమ్ముల కమలాకర్, ఆది రెడ్డి, జక్కుల సతీష్, కొమ్ము కుమార్, రమేష్, చిర్ర ఉప్పలయ్య, కుంభాల అశోక్, కొమ్ము అనీలు, సాయిలు, సురేష్, లచ్చయ్య. యక సాయిలు, పరమేష్, జక్కి యాక సాయిలు తదితరులు పాల్గొన్నారు.

"

ఇండియా 'మానవ సహిత గగన్‌యాన్'లో భాగంగా అన్‌క్రూడ్ మిషన్‌ను జనవరిలో చేపట్టే అవకాశముంది. ఇప్పటికే 8వేల టెస్టులు నిర్వహించాం. 2027లో మానవ సహిత గగన్‌యాన్‌కు ముందు మూడు అన్‌క్రూడ్ మిషన్లను చేపడతాం. భారత అంతరిక్ష కేంద్ర ఫస్ట్ మాడ్యూల్‌ను 2028లో లాంచ్ చేస్తాం. నాసాతో కలిసి రూపొందించిన నిసార్‌శాటిలైట్ ఆపరేషన్‌పై శుక్రవారం ప్రకటన చేయనున్నాం.

- ఇస్రో చైర్మన్ నారాయణన్

ప్రాంతీయం

బాసరలో కార్తీక పౌర్ణమి ఉత్సవాల వైభవం

- మెరిసిన గోదావరి తీరాలు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 5: కార్తీక పౌర్ణమి సందర్భంగా బాసర గోదావరి తీర ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంతో కాంతిమంతంగా మారింది. వేలాదిమంది భక్తులు తెల్లవారుజాము నుంచే గోదావరిలో స్నానం చేసి, బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి మాత్రమే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు తరలి వచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి నిర్వహించిన గంగా హారతి, జ్వాలాతోరణం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు, వైదిక బృందం వేదమంత్రాలతో గోదావరి తీరాన్ని మార్మోగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు ఉత్సవాలలో పాల్గొని గంగా హారతికి హాజరయ్యారు. వేద పండితులు వారికి ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. గోదావరి తీరమంతా దీపాల కాంతులతో నిండిపోగా, భక్తుల భజనలు, హారతుల నినాదాలతో బాసర పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక కాంతులతో మునిగిపోయింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్, ఏఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనా తదితర అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం సద్వినియోగం చేసుకోవాలి

- ఏఎంసీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి

ప్రతిపక్షం, మామడ, నవంబర్ 5: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ సోమా భీం రెడ్డి అన్నారు. మామడ మండలం పొన్కల్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్నరకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ. 2,389, సాధారణ రకానికి రూ2.369 మద్దతు ధర ఇస్తుందన్నారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించి, నష్టపోవద్దని సూచించారు. ఇందులో వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, ఏనుగు లింగారెడ్డి,భుజంగ శ్రీనివాస్ రెడ్డి ,లింగన్న,కాలగిరీ గంగారెడ్డి,పడాల శ్రీనివాస్,రెడ్డి నర్సరెడ్డి,రైతులు పాల్గొన్నారు.

వరంగల్ ఎమ్మెల్యేలకు షాక్ ఇచ్చిన ట్రాన్స్ జెండర్

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 5: పరిపాల చాతకాని ప్రజాప్రతినిలకు పసుపు, కుంకుమ, చీర గాజులు, పంపిస్తానని వరంగల్ నగరానికి చెందిన ట్రాన్స్ జెండర్ పుష్పిత లయ అన్నారు . వరంగల్ నగరంలో వరద ముంపుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలుస్తున్నానని ట్రాన్స్ జెండర్ పుష్పిత లయ అన్నారు.వరంగల్ హంటర్ రోడ్ లోని బాబి ఫంక్షన్ హాల్ వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వరంగల్ నగర పరిధిలోనీ విలీన గ్రామాలతో కలుపుకుని గెలిచిన నలుగురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఒక ఎంపీకి పరిపాలించడం రావడంలేదని హేద్దేవా చేశారు. ఒక ట్రాన్స్ జెండర్ గా నేను ఆవేదన వ్యక్తం చేస్తూ పరిపాలన సక్రమంగా చేసేందుకు మీకు చీర, పసుపు,కుంకుమ,గాజులు పంపించేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.వరదలు వచ్చేందుకు మీరు తీసుకున్న కమిషన్లే వాటికి నిదర్శనమని మండిపడ్డారు. వరంగల్ నగరానికి హైడ్రా రాకుండా ఈ ఎమ్మెల్యేలు ఎంపీలు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.

ఇందిరా భవన్‌పై తిరిగి కాంగ్రెస్ పతాకం ఎగరడం చారిత్రాత్మక ఘట్టం

- గుండాల మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యమాచారి

ప్రతిపక్షం, గుండాల, నవంబర్ 5: మణుగూరు ఇందిరా భవన్‌పై తిరిగి కాంగ్రెస్ పతాకం ఎగరడం చారిత్రాత్మక ఘట్టమని గుండాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోడెం ముత్యమాచారి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. "కాంగ్రెస్ పార్టీ 'బిఫార్మ్' ఆధారంగా, కార్యకర్తల చెమటోడ్చిన కష్టంతోనే రేగా కాంతారావు ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం కాంగ్రెస్ పార్టీని విడిచి అప్పటి టీఆర్ఎస్‌లో చేరడంతో, పార్టీ ప్రతీకగా ఉన్న మణుగూరు ఇందిరా భవన్‌ను కూడా 'తెలంగాణ భవన్'గా మార్చి, అక్కడి జెండాలు, ఫర్నిచర్, బోర్డులు మార్చారు అని అన్నారు."ఆ అన్యాయానికి ముగింపు పలుకుతూ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లి, బీఆర్ఎస్ పార్టీ జెండాలు, బోర్డులు, ఫర్నిచర్‌ను బయటకు తీసి, భవనంపై తిరిగి కాంగ్రెస్ జెండాను ఎగరవేయడం శుభపరిణామం అని ఇది కార్యకర్తల కృషికి నిదర్శనం"అని పేర్కొన్నారు.ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 'హత్ సే హత్ జోడో' పాదయాత్ర సందర్భంగా పినపాక నియోజకవర్గంలోని మణుగూరు కేంద్రంలో మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తల కృషితో నిర్మించిన ఇందిరా భవన్‌ను తిరిగి స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు.ఆయన మాటలు నేడు నిజమయ్యాయని ఇందిరా భవన్‌పై కాంగ్రెస్ పతాకం తిరిగి ఎగరడం కాంగ్రెస్ ఆత్మగౌరవం గెలిచిన క్షణం అని అన్నారు.అలాగే,"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, జిల్లా పార్టీ అధ్యక్షులు పొదెం వీరయ్య సహకారంతో, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదిస్తోంది" అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

టెన్త్ విద్యార్థులకు 'బండి' బంపర్ ఆఫర్

- మోదీ గిఫ్ట్ పేరుతో టెన్త్ ఎగ్జామ్ ఫీజు ఫ్రీ
- 12000 మందికి..15 లక్షలు
- ఫీజు మొత్తం చెల్లించేందుకు అంగీకారం
- ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకు లేఖ రాసిన బండి సంజయ్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 5: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బంపర్ ఆఫర్ నిజరానా ప్రకటించారు. 20252026 ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు బండి సంజయ్ ముందుకొచ్చారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు కేంద్ర మంత్రి లేఖ రాశారు. అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12,292 మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. వీరిలో కరీంనగర్ జిల్లాలో 4,847, సిరిసిల్ల జిల్లాలో 4059, సిద్దిపేట జిల్లాలో 1118, జగిత్యాల జిల్లాలో 1135, హన్మకొండ జిల్లాలో 1133 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ పరీక్ష ఫీజు చెల్లించాలంటే రూ.15 లక్షలకుపైగా ఖర్చవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారే. వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు కూలీ పని చేసి బతికేటోళ్లు. పిల్లలకు పరీక్ష ఫీజు కూడా చెల్లించే పరిస్థితి లేదని తెలుసుకున్న బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించుకున్నారు. ఆ మొత్తాన్ని తన వేతనం నుండి చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపారు. వాస్తవానికి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతోపాటు సరస్వతి శిశు మందిరాల్లో చదువుకునే విద్యార్థులుసహా దాదాపు 20 వేల మందికి ''మోదీ గిఫ్ట్'' పేరుతో బ్రాండెడ్ సైకిళ్లను పంపిణీ చేశారు. అతి త్వరలోనే సర్కారీ స్కూళ్లలో 9వ తరగతి చదువుకునే విద్యార్థులకు సైతం సైకిళ్లను పంపిణీ చేస్తామని ప్రకటించారు. అట్లాగే వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలోనే 'మోదీ కిట్స్' పేరుతో విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్ను, పెన్సిళ్లు, స్టీల్ వాటర్ బాటిల్‌ను పంపిణీ చేయబోతున్నారు.

చిట్యాల గురుద్వారాలో గురునానక్ జయంతి

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 5: నల్గొండ జిల్లా చిట్యాల లోని గురుద్వారా లో శ్రీ గురు నానక్ దేవ్ జీ జయంతి వేడుకలు బుధవారం జరిగాయి. శబద్ బాణీ కీర్తనలు, భజనలు గావించి సామూహిక ప్రార్థనలు చేసారు. ఈ వేడుకల్లో హైదరాబాద్ కు చెందిన ప్రముఖ సంకీర్తన చార్యులు భాయి రవీందర్ సింగ్ బృందం పాలుపంచుకున్నారు.సూర్యాపేట, భువనగిరి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పాటు ప్రముఖ గురు ధర్మ ప్రచార పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బహదూర్ సింగ్, ప్రేమ్ సింగ్, అంగద్ సింగ్, పరమేశ్వర్ సింగ్, జీవన్ సింగ్, ఉత్సవ నిర్వాహకులు సంత్ సింగ్ పాల్గొన్నారు. అనంతరం భక్తులు సహపంక్తి భోజనం చేశారు.

72 వేల ఉచిత చేప పిల్లల పంపిణీ

- 100 కుటుంబాలకు ఉపాధి

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 5: చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ పెద్ద చెరువులో బుధవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు శ్రీనివాస్, రాజారాం, వెలిమినేడు పీఏసీఎస్ ఛైర్మెన్ ఏనుగు రఘుమారెడ్డి, మాజీ అధ్యక్షులు మోరసత్తయ్య, భైరబోయిన బిక్షం, దేశగాని మల్లయ్య, నూతి వెంకటేశం, నూతి తిరుమలేష్, మోర నడిపి సత్తయ్య, నూతి కిష్టయ్య, దేశగాని గోపాలస్వామి, నూతి యాదయ్య, నూతి సతీష్, యాట నరసింహ పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సంఘం మండల కమిటీ ఎన్నిక

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 5: తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం చిట్యాల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రుద్రారపు పెద్దులు, ప్రధాన కార్యదర్శిగా ఐతరాజు యాదయ్యలు ఎన్నికయ్యారని, చిట్యాల లో జరిగిన మండల మహా సభలో నూతన కమిటీ ఎన్నిక జరిపినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చెరుకు పెద్దులు బుధవారం తెలిపారు. మండల కమిటీ నూతన గౌరవ సలహాదారులుగా ఎద్దులపురి క్రిష్ణ, ఆనగంటి ముత్యాలు, గౌరవ అధ్యక్షులు గా దామనూరి కనకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఐతరాజు నర్సింహా, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా గోలి మహేష్ లతో పాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారని వివరించారు.

జనసేన పార్టీలో చేరికలు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 5: మక్తల్ నియోజకవర్గ జన సేన పార్టీ ఇంచార్జ్ మణికంఠ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. తెలంగాణ జనసేన పార్టీ నాయకత్వం ఆదేశాల మేరకు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు సిద్ధాంతాలు నచ్చి నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం మద్దూరు మండల కేంద్రంలో పార్టీలో వివిధ గ్రామాలకు చెందిన యువకులు జనసేన పార్టీ కోసం తమవంతుగా కొడంగల్ నియోజకవర్గంలో కూడా పార్టీ బలోపేతం కోసం పనిచేస్తామని జనసేన పార్టీలో చేరారు. ఆంజనేయులు ,అజయ్ కుమార్, గుండురాజ్, సదానంద్, నరేష్, పరమేశ్, రాఘవులు, అంజి, నాగేష్, రమేష్, చిన్న, కృష్ణ, శివరాజ్, రాజ్ తదితరులు పార్టీలోచేరిన వారిలో ఉన్నారు. డాక్టర్ మణికంఠ గౌడ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ప్రజా సమస్యల కోసం ప్రశ్నించడం కోసం ఎంత దూరమైన వస్తాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మక్తల్ నియోజవర్గ ముఖ్య నాయకులు గౌడి బాల్ రెడ్డి, శివ ప్రసాద్, భీమేష్ ముదిరాజ్ , నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పత్తికూలీల తరలింపు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 5: నారాయణ పేట జిల్లా, మక్తల్ నియోజకవర్గ వ్యాప్తంగా పత్తి తీసేందుకు మహిళా కూలీలను ఆటోలో తరలిస్తున్నారు. అయితే ఈ ఆటోలు పరిమితికి మించి కూలీలను ఎక్కిస్తుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క ఆటోలో దాదాపు 20 నుంచి 30 మంది వరకు కూలీలను ఎక్కిస్తున్నారు, ఏదయినా ప్రమాదం జరగకముందే ఈ విషయమై అధికారులు తనిఖీలు నిర్వహించి, తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శ్రీ మహాశక్తి దేవాలయానికి పోటెత్తిన భక్తులు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 5: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని కరీంనగర్ లోని శ్రీ మహాశక్తి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. సత్యనారాయణ స్వామి వ్రతాలకు నేడు శ్రీ మహాశక్తి దేవాలయం ఒక తెలంగాణ అన్నవరంగా మారింది. దేవాలయంలో ప్రత్యేకంగా పూలతో అలంకరించిన మండపం వేయగా, అందులో సామూహికంగా శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతం కన్నుల పండుగగా జరిగింది. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి దివ్య ఆశీస్సులతో ఆలయ వేద పండితులు ఇట్టి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం శివ కేశవుల ఆరాధనకు ముఖ్యమైనది. ఈ మాసంలో ప్రతి ఒక్కరూ చేసే పవిత్రమైన పూజ సత్యనారాయణ స్వామి వ్రతం. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల, సత్యనారాయణ స్వామిని పూజించడంవల్ల ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, కష్టాలనుండి విముక్తి లభిస్తుందని, విశేషంగా కుటుంబ శ్రేయస్సు కలుగుతుందని, ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా భార్యాభర్తలు ఆనందంగా ఉండేందుకు ఈ సత్యనారాయణ స్వామి వారు కాపాడుతారని హిందువుల విశ్వాసం. ప్రజల యొక్క పాపాలను, బాధలను, కష్టాలను తీర్చే వ్రతం ఈ సత్యదేవుని వ్రతమని సాక్షాత్తు విష్ణుమూర్తి నారదునికి చెప్పినట్లు పురాణాలు మనకు చెబుతున్నాయి.

భక్తుల విశ్వాసానికి అనుగుణంగా శ్రీ మహాశక్తి దేవాలయంలో బుధవారం రోజున చేపట్టిన శ్రీరమా సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవంలో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజ అనంతరం ఆలయ అర్చకులు వ్రతంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి ప్రసాదంతో పాటు ఆశీర్వదించారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులు తులసి చెట్టు వద్ద వివిధ దేవతా వృక్షాల వద్ద కార్తీకదీపం వెలిగించి మొక్కులు చెల్లించారు. కార్తీక పౌర్ణమి రోజున దీపారాధన ప్రధాన అంశం. ఎవరైతే ఆలయాల్లో లేదా పవిత్ర స్థలాల్లో దీపాలను దానం చేస్తారో వారికి కోటి జన్మల పుణ్యం లభిస్తుందని, ఈ దీపం మనలోని అంధకారాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని తద్వారా మోక్ష ప్రాప్తికి దారి చూపుతుందని హిందువుల విశ్వాసం. ఈ సందర్భంగా అనేకమంది భక్తులు దేవాలయంలో దీప దానాలను అందించారు.

“

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను నీరుగార్చుతోంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారి 2,500 విద్యాసంస్థలు మూతబడ్డాయి. బీఆర్ఎస్ పాలనలో రెండేళ్లు, కాంగ్రెస్ పాలనలో రెండేళ్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాక స్టూడెంట్స్, స్టాఫ్ ఇబ్బందులు పడుతున్నారు. రూ.10,500 కోట్ల బకాయిల్లో సగం చెల్లించమని యాజమాన్యాలు కోరినా ప్రభుత్వం కమిటీలంటూ కాలయాపన చేస్తోంది.
- ట్విటర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్

విశ్వ వీక్షణం

స్థానిక ఎన్నికలలో ట్రంప్ కు ఎదురు దెబ్బ

- రిపబ్లికన్ పార్టీకి ఎక్కడా దక్కని ప్రాధాన్యం

న్యూయార్క్ (అమెరికా) నవంబర్ 5: అమెరికాలో తాజాగా జరిగిన స్థానిక ఎన్నికలలో డెమొక్రట్ పార్టీకి ఘన విజయం లభించింది. వర్జీనియా, న్యూజెర్సీ గవర్నర్ ఎన్నికలు, న్యూయార్క్ సిటీ మేయర్ రేసు సహా ముఖ్యమైన పోటీలలో డెమొక్రట్లు స్వీప్ చేశారు. రెండోసారి అధ్యక్షుడైన డొనాల్డ్ ట్రంప్‌కు మొదటి పెద్ద ఎదురుదెబ్బ అంటున్నారు. ఫెడరల్ ప్రభుత్వ షట్‌డౌన్, ఆర్థిక సమస్యలు, ట్రంప్ విధానాలపై అసంతృప్తి కారణంగా ఓటర్లు డెమొక్రట్ల వైపు మొగ్గు చూపారు. ఈ ఎన్నికలు ట్రంప్ రెండో టర్మ్ ప్రారంభానికి పెద్ద పరీక్షగా మారాయి. వర్జీనియాలో డెమొక్రట్ అబిగెయిల్ స్పాన్‌బర్గర్ అటు రిపబ్లికన్ విన్సమ్ ఎర్లసియార్స్‌ను ఓడించి గెలిచి, వర్జీనియా చరిత్రలో మొదటి మహిళా గవర్నర్‌గా చరిత్ర సృష్టించారు. ఓటర్లు ఫెడరల్ వర్క్‌ఫోర్స్ లేఅవుట్లు, షట్‌డౌన్ ప్రభావాల మీద ఆగ్రహం చూపారు. న్యూజెర్సీలో కూడా డెమొక్రట్ మికీ షెరిల్ ట్రంప్ ఎండోర్స్‌మెంట్ పొందిన రిపబ్లికన్ జాక్ సియాటరెల్లిని ఓడించారు. 1961 తర్వాత మొదటిసారి ఒకే పార్టీ మూడు వరుసగా గవర్నర్ పదవులు దక్కించుకుంది. కాగా, షెరిల్ రెండో మహిళా గవర్నర్‌గా రికార్డు సృష్టించారు. న్యూయార్క్ సిటీ మేయర్ రేసులో డెమొక్రట్ జోరాన్ మమ్దానీ ఇండిపెండెంట్ ఫార్మర్ గవర్నర్ ఆండ్రూ కుమో, రిపబ్లికన్ కర్టిస్ స్లివాను ఓడించి గెలిచారు. ట్రంప్ ఈ ఫలితాలను సోషల్ మీడియాలో తీవ్రంగా విమర్శించారు.

తుది దశకు చేరిన బిహార్ పోల్ సీన్

- ఎక్కడ చూసిన కుప్పలు తెప్పలుగా తాయిలాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 5 : బిహార్ తొలిదశ ఎన్నికలు గురువారం జరుగనున్నాయి. ప్రలోభాల పంపిణీ వేగం పుంజుకుంది. పార్టీ నేతలు వస్తువులు, మద్యం, నగదుతో ఆగకుండా మాదకద్రవ్యాలు పంపిణీకి కూడా దిగారు. దీంతో ఎన్నికల సంఘం తగు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ కొరడా ఝుళిపిస్తోంది. స్వాధీనం చేసుకున్న సరుకుల విలువ దాదాపు 108 కోట్లు ఉంటుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. నిజానికి బిహార్ లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలక ప్రకటించినప్పటి నుంచి ఎక్కడ చూసినా కుప్పలు తెప్పలుగా తాయిలాల జాతర షురూ అయింది. మేనిఫెస్టోల రూపంలో అధిష్టానాలు ప్రకటించే వరాల కంటే, చాటుమాటుగా గల్లీలలో జరిగే పంపిణీలే ఎక్కువగా ఉంటున్నాయి. స్పెషల్ పికెట్‌లు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తూ, ప్రలోభాలకు చెక్ పెట్టే ప్రయత్నం చేసినా ఓటర్లను లోబర్చుకునే తంతు ఆగడం లేదు. ఇప్పటికీ 9.62 కోట్ల నగదు, 42.14కోట్ల విలువైన మద్యం, 5.8 కోట్ల ఆభరణాలు, 26కోట్ల సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. పదేండ్లుగా బిహార్‌లో మద్యపాన నిషేధం అమలవుతున్నప్పటికీ, ఓటర్లను ప్రలోభపెట్టడానికి పొరుగురాష్ట్రాల నుంచి లిక్కర్ తరలిస్తున్నాయి పార్టీలు. 24.61 కోట్ల విలువైన డ్రగ్స్ కూడా పట్టుబడ్డాయి. ఈసీ బిహార్ అంతటా 824 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసి, ఎక్కడికక్కడ ఆకస్మిక తనిఖీలు చేయిస్తోంది.

ఓటు చోరీ ద్వారా గెలిచేందుకు ఎన్డీయే యత్నాలు

- బిహార్ ప్రచార సభలలో ప్రియాంక తీవ్ర వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 5 : బిహార్‌లో ఓటు చోరీ ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఎన్డీయే కోరుకుంటోందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఆరోపించారు. ఎన్డీయే 20 యేండ్ల పాలనపై ప్రజలు విసుగుచెందారని వారికి అర్థమైందన్నారు. బిహార్‌చంపారణ్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలలో బుధవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రియాంక గాంధీ మాట్లాడారు. దేశంలోని ప్రస్తుత పరిస్థితి బ్రిటిష్ రాజుల కాలాన్ని తలపిస్తోందని విమర్శించారు. హర్యానాలో జరిగిన ఓటు చోరీ ఉదంతాన్ని ప్రజలకు సోదరుడు రాహుల్ వివరించారన్నారు. దేశంలోని ప్రతీ వ్యవస్థనూ ఎన్డీయే నాశనం చేస్తోందని మండిపడ్డారు. భవిష్యత్తులో ఈ దేశంలో ఎన్నికలు కూడా జరుగుతాయా లేదా అన్న అనుమానం కలుగుతోందన్నారు. ప్రజలు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. వారిని అధికారం నుంచి దించేయాల్సిన అవసరం ఉందని ప్రియాంక చెప్పారు. అటు బిహార్‌లో నేరాలు, అవినీతి, యువత విద్య మీద దృష్టి పెట్టడం కన్నా, కాంగ్రెస్ పోస్టర్‌లో తేజస్వీ యాదవ్ ఫొటో ఎందుకు లేదనే అంశం మీదనే ప్రధాని ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని విమర్శించారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను ప్రధాని మోడీ తన ఎన్నికల ర్యాలీల వేదికలపై కూడా పక్కన కూడా ఉంచుకోవడం లేదన్నారు. అటు మోడీ, అమిత్ షా సొంత రాష్ట్రమైన గుజరాత్‌లోనే పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయని, బిహార్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రియంక ఆరోపించారు.

పంజాబ్ లో మరో కబడ్డీ ప్లేయర్ హత్య

- తామే చంపామని ప్రకటించిన లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చండీఘర్, నవంబర్ 5 : పంజాబ్ రాష్ట్రంలోని లూధియానాలో కబడ్డీ ఆటగాడు గుర్విందర్ సింగ్‌ను (23) గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. సోమవారం రాత్రి నలుగురు దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. గుర్విందర్ చనిపోగా, అతడి స్నేహితుడికి తీవ్ర గాయాలయ్యాయి. తామే ఈ హత్యను చేశామని లారెన్స్ బిష్ణోయ్ ముఠా ప్రకటించింది. అయితే, ఈ హత్య నిజంగా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ చేసిందా? లేదా? అనేది పోలీసులు ధ్రువీకరించలేదు. వారం వ్యవధిలో జరిగిన రెండో కబడ్డీ ప్లేయర్ హత్య ఇది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. మంకీ గ్రామానికి చెందిన గుర్విందర్ సింగ్, తన స్నేహితులు ధర్మవీర్ సింగ్, లవ్‌ప్రీత్ సింగ్‌తో కలిసి సోమవారం రాత్రి ఒక దుకాణం బయట నిలుచున్నాడు. ముసుగు ధరించిన కొందరు దుండగులు బైకులపై వచ్చి గుర్విందర్, అతడి స్నేహితులపై కాల్పులు జరిపారు. దీంతో గుర్విందర్, ధర్మవీర్ తీవ్రంగా గాయపడ్డారు. లవ్‌ప్రీత్ సురక్షితంగా బయటపడ్డాడు. గాయపడిన గుర్విందర్, ధర్మవీర్‌ను సమ్రాలాలోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వారిని చండీగఢ్ పీజీఐకి పంపించారు. చండీగఢ్ పీజీఐలో చికిత్స పొందుతూ గుర్విందర్ మరణించగా, ధర్మవీర్‌కు చికిత్స కొనసాగుతోంది. గుర్విందర్ సింగ్ తండ్రి రాజేంద్ర సింగ్ మాట్లాడుతూ నిందితులను త్వరగా పట్టుకోవాలని పోలీసులను కోరారు. తమకు ఎవరితోనూ శత్రుత్వం లేదన్నారు.

డీఎంకేకు బలమైన ప్రత్యామ్నాయం టీవీకే

- పార్టీ జనరల్ కౌన్సిల్ లో చీఫ్ విజయ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, నవంబర్ 5 : తమిళనాడులో డీఎంకేకు బలమైన ప్రత్యామ్నాయం తామేనని టీవీకే చీఫ్ విజయ్ అన్నారు. వచ్చే యేడాది జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో ప్రధాన పోటీ డీఎంకే, టీవీకే మధ్యే ఉంటుందని అన్నారు. టీవీకే వంద శాతం గెలుపొందుతుందని చెప్పారు. కరూర్ తొక్కిసలాట ఘటన మీద తొందపాటుగా ఏక సభ్య కమిషన్‌ను నియమించడాన్ని ప్రజలు సమించడం లేదని వ్యాఖ్యానించారు. మహాబలిపురంలో బుధవారం టీవీకే పార్టీ ప్రత్యేక జనరల్ కౌన్సిల్ మీటింగ్ జరిగింది.తొక్కిసలాట జరిగిన తర్వాత పార్టీ అనేక ఇబ్బందులను ఎదుర్కొందని, ఇవన్నీ తాత్కాలికమేనని విజయ్ వివరించారు. వీటన్నింటిని పరిష్కరించుకుందామని తెలిపారు. ప్రజల రూపంలో దేవుడు, ప్రకృతి మనతో ఉన్నారని, ఇంకెవ్వరూ మనల్ని ఆపలేరని అన్నారు. తొక్కిసలాట ఘటన తనను ఎంతో కలిచివేసిందన్నారు. ఈ సమావేశంలోనే పార్టీ 12 కీలక తీర్మానాలను ఆమోదించింది. టీవీకే పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా విజయ్‌ను ఎన్నుకుంటూ కూడా ఓ తీర్మానం చేసింది. ఎన్నికలలో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలనే అంశంపై నిర్ణయాన్ని పూర్తిగా విజయ్‌కే అప్పగిస్తూ తీర్మానించింది. తొక్కిసలాట కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు బాధిత కుటుంబాలు, ప్రత్యక్ష సాక్షులు, స్థానికుల నుంచి వాంగ్మూలాలు సేకరిస్తున్నారు. సీబీఐ అధికారులు తమిళగ వెట్రి కళగం ప్రధాన కార్యాలయానికి కూడా వెళ్లినట్లు తెలిసింది.

మనిషికి మెగ్నీషియం లోపిస్తే ఏమవుతుంది?

మెగ్నీషియం మనకు ఎంత అవసరం!

డా. కౌశల్ గోవర్ధన
7702417779
వైస్ చైర్మన్
శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
ధనుంజయ నర్సింగ్ హోమ్, హైదరాబాద్

మారుతున్న జీవనశైలి మనిషిని మంచాన పడేస్తున్నది. అవసరమైన పోషకాలు లేక శరీరం రోగాల పుట్టగా మారుతున్నది. చీటికీమాటికీ ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నది. ముఖ్యంగా, 'మెగ్నీషియం' లోపంతో నవతరం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నది. మెగ్నీషియం లోపాన్ని హైపోమాగ్నేసిమియా అంటారు. ఇది శరీరంలో అనేక రకాల సమస్యలతోపాటు కండరాల తిమ్మిరి, ఒత్తిడి, నొప్పి, కాళ్లు, వీపు, మెడలో నొప్పి వస్తుంది. మెగ్నీషియం కండరాలను సడలించడానికి, వాటి సంకోచాలను నియంత్రించడానికి సహాయపడుతుంది. మనం ఆరోగ్యంగా ఉన్నంతకాలం శరీరం పై శ్రద్ధ పెట్టాలని అనిపించదు. కానీ, ఎప్పుడైనా అనారోగ్యం వస్తే, ఎందుకిలా అయ్యింది అన్న అనుమానం వస్తుంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అనిపిస్తుంది. మనిషి శరీరంలో జరిగే సుమారు 300 రకాల రసాయనిక చర్యలలో కీలకపాత్ర పోషిస్తుంది. అలాంటి మెగ్నీషియం లోపిస్తే తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది.

మెగ్నీషియం లోపిస్తే ఏం జరుగుతుంది?

మానవ శరీరంలో ఉండే అత్యంత సమృద్ధమైన ఖనిజాలలో మెగ్నీషియం ఒకటి. చాలా పోషకాలు మనల్ని ఆరోగ్యంగా ఉండేలా చూస్తాయి. కొన్ని పోషకాల లోపంతో ఇబ్బంది లేకపోయినా, మరికొన్ని పెరుగుదలకు చాలా అవసరం. అవి లేకుండా జీవించడం కష్టం. అలాంటి పోషకాలలో మెగ్నీషియం ఒకటి. ప్రపంచవ్యాప్తంగా నలుగురిలో ఒకరు మెగ్నీషియం లోపంతో బాధపడుతున్నారు. మనలో 80 శాతం మంది జనం మెగ్నీషియంను తీసుకోవడం లేదు. ఈ ఖనిజం లోపంతో తలనొప్పులు, ఆందోళన, కుంగుబాటు, ఒత్తిడి లక్షణాలు ఉధృతమవుతాయి . అందువల్ల మెరుగైన ఆరోగ్యం కోసం మీరు తీసుకొనే ఆహారాన్ని సరిచూసుకోవడం తప్పనిసరి. ఈ ఖనిజం ఆహారాన్ని శక్తిగా మార్చడం, కణాలను బాగు చేయడం, అమైనో ఆమ్లాలను ఉపయోగించి ప్రొటీన్లను తయారు చేయడం, కండరాల కణజాలం సడలించడానికి కూడా దోహదపడుతుంది. ఆకుకూరలు, కూరగాయలలో ఎక్కువగా మెగ్నీషియం ఉంటుంది. వాటితోపాటూ డార్క్ చాకొలెట్స్ (ఖరీదైన కోకో చాకొలెట్లు)లో కూడా మెగ్నీషియం ఉంటుంది.మనం ఫిట్‌గా ఉండాలంటే మెగ్నీషియం మన బాడీలో ఉండాలి. మన శరీరంలో వందల కొద్దీ ఉన్న ఎంజైముల పనితీరును మెగ్నీషియం మెరుగుపరుస్తుంది. కార్బోహైడ్రేట్స్ (పిండి పదార్థాలు), కొవ్వు, ప్రోటీన్స్ (మాంస పదార్థాలు) నుంచీ మనకు ఎనర్జీ వచ్చేలా చెయ్యడంలో మెగ్నీషియంది కీలక పాత్ర. నాడీ వ్యవస్థ చక్కగా ఉండాలంటే కూడా మెగ్నీషియం అవసరం.
మెగ్నీషియంను రోజూ తీసుకోవడం ద్వారా శరీరంలోని రక్తపోటు స్థాయిలను సాధారణ స్థితికి తెస్తుంది. బాడీలో రక్తపోటు స్థాయిలను తగ్గించడానికి సహాయపడుతుంది. రక్తపోటుతో బాధపడుతున్న రోగులకు చికిత్స చేయడానికి సహాయపడుతుంది. మెగ్నీషియం లోపం ఉంటే రక్త నాళాలు కుంచించుకుపోవచ్చు. ఇది రక్తపోటును పెంచుతుంది. రక్తపోటు అకస్మాత్తుగా పెరిగితే అది మెగ్నీషియం లోపానికి సంకేతం కావచ్చు. కాబట్టి ఈ ఖనిజాన్ని రోజు తీసుకోవడం వల్ల శరీరంలోని రక్తపోటు స్థాయిలను సమతుల్యం చేయడం ద్వారా గుండెజబ్బులకు సంబంధించిన ప్రమాదాన్ని దూరం చేసుకోవచ్చు, మెగ్నీషియం లోపంతో హృదయ స్పందన కూడా సక్రమంగా ఉండదు. దీనిని అరిథ్మియా అంటారు.

రోజుకు ఎంత మోతాదులో కావాలి

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ లెక్కల ప్రకారం, మెగ్నీషియం రోజుకు ఎంత మోతాదులో కావాలంటే, పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వయస్సున్న చిన్నారులకు నిత్యం 30 మిల్లీగ్రాముల మెగ్నీషియం అవసరం అవుతుంది. 7 నుంచి 12 నెలల వయస్సు ఉన్నవారికి 75 మిల్లీగ్రాములు, 1 నుంచి 3 యేండ్ల వారికి 80 మిల్లీ గ్రాములు, 4-8 యేండ్లవారికి 130 మిల్లీగ్రాములు, 9 - 13 యేండ్ల వారికి 240 మిల్లీగ్రాములు, 14 - 18 యేండ్ల వారికి బాలురు అయితే రోజుకు 410 మిల్లీగ్రాములు, బాలికలు అయితే 360 మిల్లీగ్రాములు, 19 నుంచి 30 యేండ్లవారికి బాలురకు 400 మిల్లీగ్రాములు, బాలికలకు 310 మిల్లీగ్రాములు, 31 - 50 యేండ్ల వారికి పురుషులు అయితే 420 మిల్లీ గ్రాములు, స్త్రీలకు 320 మిల్లీ గ్రాములు, 51 యేండ్లకు పైబడిన వారికి పురుషులకు 420 మిల్లీగ్రాములు, స్త్రీలకు 320 మిల్లీ గ్రాములు, గర్భిణులకు నిత్యం 400 మిల్లీ గ్రాములు, పాలిచ్చే తల్లులకు రోజుకు 360 మిల్లీగ్రాముల మెగ్నిషియం అవసరం అవుతుంది.

మనం తీసుకొనే ఆహారంలో ఎంత ఉంటుంది!

30 గ్రాముల బాదాంలో 80 మి.గ్రా. మెగ్నీషియం ఉంటుంది. 30 గ్రాముల జీడిపప్పు – 72 మి.గ్రా, 30 గ్రాముల వేరుశనగలో 49 మి.గ్రా, 30 గ్రాముల గుమ్మడి గింజలలో 150 మి.గ్రా, 1 చెంచాడు అవిసె గింజలలో 40 మి.గ్రా, అరకప్పు మొక్కజొన్న గింజలు – 27 మి.గ్రా మెగ్నీషియం ఉంటుంది. అరకప్పు ఉడికించిన శనగలలో 60 మిగ్రా మెగ్నీషియం లభిస్తోంది. వీటితో పాటు కంది, పెసర, మినప, శనగ పప్పులో మెగ్నీషియం సమృద్ధిగా ఉంటుంది. పాలు, పెరుగులో క్యాల్షియంతో పాటు మెగ్నీషియం కూడా లభిస్తుంది. 1 కప్పు పాలలో 27 మి.గ్రా, పావు కిలో పెరుగు – 42 మి.గ్రాముల మెగ్నీషియం ఉంటుంది. ఆకు కూరలు, కూరగాయలలో మెగ్నీషియం అధికంగా ఉంటుంది. అరకప్పు ఉడికించిన పాలకూర – 78 మి.గ్రా, అరకప్పు బఠానీలు 31 మి.గ్రా, అరకప్పు బంగాళాదుంపలు – 48 మి.గ్రా మెగ్నీషియం ఉంటుంది. రోజువారీగా తీసుకునే ఆహారం ద్వారా ఇది శరీరానికి అందుతుంది.

మెగ్నీషియం ఉండే ఆహారాలు

ఖర్జూరాలు, బఠాణీలు, కోకో, జీడిపప్పు, బాదం, పాస్తా, గింజలు, తృణధాన్యాలు, పప్పులు, ఆకు కూరలు, పండ్లు (ఫిగ్స్, ఆవకాడో, అరటిపండ్లు, రాస్ బెర్రీస్), బ్రకోలీ, క్యాబేజీ, గ్రీన్ బఠాణీలు, మొలకల వంటివి. సీఫుడ్ (సాల్మన్, మాకెరెల్, ట్యూనా ఫిష్), బ్రౌన్ రైస్, ఓట్స్.

ప్రధానిని కలిసిన భారత మహిళల జట్టు

- క్రీడాకారిణులకు ఆతిథ్యమిచ్చిన నరేంద్ర మోడీ

వన్డే ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళల జట్టుకు ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం ఆతిథ్యం ఇచ్చారు. మన అమ్మాయిలు పలు ఓటముల తర్వాత కూడా అత్యద్భుతంగా ప్రశంసించారు. ప్రధాని మోడీ తన నివాసంలో మహిళల జట్టును కలిశారు. సోషల్ మీడియాలో ఎదురైన ట్రోలింగ్‌ను తట్టుకుని విజయాన్ని సాధించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ తాము 2017లో ట్రోఫీ లేకుండా మోడీని కలిశామని, ఈసారి ట్రోఫీతో కలిసి కలవడం గర్వంగా ఉందని అంది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన మాట్లాడుతూ ప్రధాని తమను ఎప్పుడూ ప్రోత్సహిస్తూనే ఉన్నారని వివరించింది. దీప్తి శర్మ మాట్లాడుతూ 'కష్టపడి పనిచేస్తే అందరి కలలు నిజమవుతాయి' అని 2017లో మోడీ చెప్పిన మాటలను గుర్తు చేసింది. కాగా, ప్రధాని దీప్తి శర్మ చేతిపై ఉన్న భగవాన్ హనుమాన్ టాటూ, ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో 'జై శ్రీరామ్' రాసిన విషయాన్ని ప్రస్తావించారు. ఇందుకు జవాబుగా దీప్తి 'అవి నాకు శక్తినిస్తాయి' అని చెప్పింది. మిగతా క్రీడాకారిణులు కూడా ప్రధానితో మాటలు కలిపారు.

క్లాసెస్ విషయంలో కావ్య తప్పు చేస్తున్నదా!

- ఔననే అంటున్న క్రీడా విశ్లేషకులు

ఐపీఎల్ మినీ వేలం డిసెంబర్ రెండవ వారంలో జరుగుతుందని సమాచారం. బీసీసీఐ అధికారికంగా తేదీలను అయితే ప్రకటించలేదు. కానీ, నవంబర్ చివరి వారం లోపుగా ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్, రిలీజ్ క్రీడాకారుల జాబితాలను ప్రకటించాల్సి ఉంటుందని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే ఫ్రాంచైజీలు ఇప్పటికే ఎవరికి ఉంచుకోవాలో, ఎవరిని వదిలేయాలో నిర్ణయించుకునే పనిలో పడ్డాయి. గత మెగా వేలంలో అత్యధిక ధర పలికి, సరిగా ఆడని క్రీడాకారులను ఫ్రాంచైజీలు వదిలేసే అవకాశాలు ఉన్నాయి. తద్వారా మిగిలే భారీ సొమ్ముతో తాజా వేలానికి వెళ్లవచ్చని భావిస్తున్నాయి. ఈ క్రమంలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ జట్టు స్టార్ ప్లేయర్ హెన్రీచ్ క్లాసెన్‌ను వదిలేయనుందని మీడియా కథనాలు వస్తున్నాయి. గత సీజన్ వేలానికి ముందు ఆరెంజ్ ఆర్మీ క్లాసెన్‌ను రూ. 23 కోట్ల భారీ ధరకు రిటైన్ చేసుకుంది. క్లాసెన్ కూడా ఈ ధరకు న్యాయం చేశాడు. 13 మ్యాచులలో 487 పరుగులు చేశాడు. ఈ యేడాది అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. ఈ క్రమంలోనే అతన్ని వేలంలోకి వదిలేసి, తక్కువ ధరకు తిరిగి కొనుగోలు చేయాలని కావ్యమారన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ, క్లాసెన్‌ను వదిలేస్తే మాత్రం సీఎస్‌కే అతడిని వేలంలో వదిలిపెట్టదని నిపుణులు చెబుతున్నారు. క్లాసెన్ కోసం సీఎస్‌కే ఎంతైనా ఖర్చు చేస్తుందని చెబుతున్నారు.

ఐసీసీ సమావేశానికి మొహిసిన్ నఖ్వీ డుమ్మా

- ఆసియా కప్ ట్రోఫీ కోసం బీసీసీఐ నిలదీస్తుందనే

ఆసియా కప్ ట్రోఫీ వివాదం నేపథ్యంలో పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ దుబాయిలో జరుగుతున్న ఐసీసీ సమావేశానికి హాజరు కావడం లేదని సమాచారం. సమావేవానికి హాజరైతే బీసీసీఐ ఆసియా కప్ ట్రోఫీ గురించి ప్రశ్నిస్తుందని, ట్రోఫీని తక్షణమే అప్పగించాలని డిమాండ్ చేస్తుందని భావించే నఖ్వీ ఈ భేటీ నుంచి తప్పించుకుంటున్నారని తెలిసింది. ఐసీసీ నాలుగు నాలుగు రోజుల సమావేశాలు బుధవారం దుబాయిలో ప్రారంభమయ్యాయి. భారత్ ఆసియా కప్ గెలిచిన తర్వాత ఏసీసీ చైర్మన్, పాకిస్తాన్ మంత్రి కూడా అయిన మొహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోవడానికి టీమిండియా నిరాకరించింది. దీనితో నఖ్వీ ఆ ట్రోఫీని తన వెంట తీసుకెళ్లారు. అప్పటి నుంచి ట్రోఫీ ఎక్కడుందో తెలియదు. ట్రోఫీని తిరిగి ఇవ్వాలని ఏసీసీకి బీసీసీఐ లేఖ రాసినా సరైన సమాధానం రాలేదు. దీంతో ఐసీసీ సమావేశంలో ఈ సమస్యను లేవనెత్తుతామని బీసీసీఐ ప్రకటించింది. అయితే, నఖ్వీ తను సమావేశానికి రాకపోవడానికి దేశీయ రాజకీయ సమస్యలను కారణంగా చూపారు. ఏడున జరగనున్న ఐసీసీ సమావేశానికి నఖ్వీ స్థానంలో పీసీబీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుమైర్ సయీద్ హాజరవుతారని అంటున్నారు. నఖ్వీ వీడియో కాల్ ద్వారా సమావేశంలో పాల్గొనే అవకాశం ఉందని కూడా సమాచారం. ఆ ట్రోఫీని ఏసీసీ ఛైర్మన్ మాత్రమే ఇవ్వాలనే నిబంధన ఏదీ లేదు. ఈ నేపథ్యంలో ఐసీసీ నఖ్వీని మందలించి, త్వరలోనే టీమిండియాకు ట్రోఫీని అప్పగించే అవకాశం ఉంది.

జైపూర్ మ్యూజియంలో హర్మన్‌ప్రీత్ కౌర్‌విగ్రహం

- 2008 మార్చి 8న ఆవిష్కరణ

భారత మహిళల జట్టుకు వన్డే ప్రపంచ కప్ సాధించి పెట్టిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు అరుదైన గౌరవం లభించింది. జైపూర్ వ్యాక్స్ మ్యూజియం నిర్వాహకులు ఆమె మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భారత మహిళల జట్టుకు వన్డే వరల్డ్‌కప్ అందించిన తొలి కెప్టెన్‌గా నిలిచిన హర్మన్ గౌరవార్థం విగ్రహం ఏర్పాటు చేయాలని మ్యూజియం వ్యవస్థాపకులు అనూప్ శ్రీవాస్తవ తెలిపారు. టీమిండియా వరల్డ్‌కప్ విజయానికి ఈ విగ్రహాన్ని అంకితం ఇస్తామని అన్నారు. కౌర్ మన క్రికెట్‌కు తగు సేవలు అందించడమే కాదు, ఈ గెలుపుతో మహిళా సాధికారతకు తోడ్పడిందని పేర్కొన్నారు. ప్రముఖ వ్యక్తులవే కాదు, హర్మన్‌లా భవిష్యత్ తరానికి స్ఫూర్తినిచ్చే వాళ్ల విగ్రహాలు కూడా తాము మ్యూజియంలో పెడతామని వెల్లడించారు. 2008 మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ విగ్రహాన్ని ఆవిష్కరిస్తుందని తెలిపారు. ఈ మ్యూజియంలో ఇప్పటికే ధోనీ, సచిన్, విరాట్ వంటి దిగ్గజ క్రికెటర్ల మైనపు విగ్రహాలు ఉన్నాయి. కల్పనా చావ్లా, సైనా నెహ్వాల్, మదర్ థెరిసా, అక్కడి రాజమాత గాయత్రి దేవి, హాది రాణి వంటి మహిళా విగ్రహాలను కూడా ఇక్కడ ఏర్పాటు చేశారు.

చికిరి.. చికిరి..

'పెద్ది' తొలి పాట ప్రోమో రిలీజ్, లిరికల్ వీడియో నవంబర్ 7న రిలీజ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పాన్-ఇండియా మూవీ 'పెద్ది' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. బుచ్చి బాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఇంతకు ముందు ఎప్పుడూ చూడని పాత్రకు ప్రాణం పోసేందుకు రామ్ చరణ్ అద్భుతంగా ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఫస్ట్ గ్లింప్స్ పాన్ ఇండియా సెన్సేషన్ క్రియేట్ చేసింది. మరింత ఎక్సయిట్మెంట్ క్రియేట్ చేస్తూ మేకర్స్ ఫస్ట్ సింగిల్- చికిరి చికిరి ప్రోమోను రిలీజ్ చేశారు. ఈ ప్రోమో, దర్శకుడు బుచ్చి బాబు సానా, అకాడమీ అవార్డు విన్నింగ్ కంపోజర్ ఎ.ఆర్. రెహమాన్ పట్ల తనకున్న అభిమానాన్ని, గౌరవాన్ని పంచుకుంటూ, పాట సందర్భాన్ని వివరిస్తూ ప్రారంభమవుతుంది. కొండల మధ్య నివసించే హీరో, ఒక అమ్మాయిని చూసిన వెంటనే ఉప్పొంగే భావోద్వేగం సంగీతంగా, సంబరంగా వెలువడుతుందని సందర్భాన్ని వివరించారు. హీరో అమ్మాయిని 'చికిరి' అని పిలుచుకోవడం ఈ పాటకు ప్రాణం అయింది. రెహమాన్ సృష్టించిన హై వోల్టేజ్ బీట్‌లకు అనుగుణంగా రామ్ చరణ్ తన సిగ్నేచర్ మాస్ డాన్స్ స్టైల్, ఎనర్జీ తో అదరగొట్టారు. ఈ పాటలో చరణ్ హుక్‌స్టెప్ క్షణాల్లో వైరల్ అయ్యింది. నవంబర్ 7న విడుదల కాబోతున్న 'చికిరి చికిరి' లిరికల్ వీడియో కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కాన్సెప్ట్ వీడియోతోనే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెరిపోయింది. రెహమాన్ సంగీతం, చరణ్ స్టెప్స్, బుచ్చిబాబు మార్క్ తో ఈ ఆల్బమ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

శ్రీ విష్ణు కొత్త సినిమా

వైవిధ్యభరితమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీవిష్ణు కథానాయకుడిగా ప్రొడక్షన్ నెం.39 ని ఈరోజు అధికారికంగా ప్రకటించింది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సన్నీ సంజయ్ రచన మరియు దర్శకత్వం వహిస్తున్నారు. "ప్రతి యువకుడి కథ"(The Story of Every Youngster) అనే అద్భుతమైన ట్యాగ్‌లైన్‌తో ఆవిష్కరించబడిన ఈ అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. సినిమా యొక్క ఆలోచనాత్మక మరియు భావోద్వేగాలతో కూడిన ప్రపంచంలోకి ఈ పోస్టర్ ప్రేక్షకులను తీసుకొని వెళుతుంది. తనదైన వినోదాత్మక నటనతో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడమే కాకుండా, అన్ని రకాల భావోద్వేగాలను గొప్పగా పలికించగల సామర్థ్యమున్న నటుడిగా పేరుగాంచిన శ్రీ విష్ణు, ఈ సినిమాలో మరో చిరస్మరణీయ పాత్రకు ప్రాణం పోసేందుకు సిద్ధంగా ఉన్నారు. 'అనగనగా'తో ఓటీటీలో అరంగేట్రం చేసి విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకుల మెప్పు పొందిన దర్శకుడు సన్నీ సంజయ్, మరో గొప్ప కథతో రాబోతున్నారు. సున్నితమైన భావోద్వేగాలతో నిండిన, రోజువారీ జీవితాన్ని నిర్వచించే నిశ్శబ్ద సంఘర్షణలు, ఆశలు మరియు సంతృప్తిలను అన్వేషించే కథతో మరోసారి ప్రేక్షకుల మనసు దోచుకోబోతున్నారు.

'జటాధర' బిగ్ స్క్రీన్ పై చూడదగ్గ సినిమా

- డివైన్ సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ ఆడియన్స్‌ని థ్రిల్ చేస్తాయి
- హీరో సుధీర్ బాబు

సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించే ఈ పాన్-ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హాల్, నిఖిల్ నందా నిర్మించారు. ఈ చిత్రంలో శిల్పా శిరోధ్కర్ కీలక పాత్ర పోషించారు. జటాధర నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో సుధీర్ బాబు అరోరా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

జటాధర కథ ఫస్ట్ టైం మీ దగ్గరికి వచ్చినప్పుడు ఎలా ఫీలయ్యారు?

చిన్నప్పుడు మనం జానపద, చందమామ కథలు వినుంటాం.' బ్యాంకులో లేని సమయంలో ధనాన్ని భూమిలో పాతి ఒక బంధనం వేసి దానికి ఒక పిశాచి కాపలాగా ఉంటుంది' అని ప్రచారంలో ఒక కథ ఉండేది. ఈ కథకు అలాంటి ఒక జానపదం ఆధారం. అలాంటి కథని ప్రజెంట్ టైం లోకి వచ్చి తీసుకొచ్చి చాలా ఇంట్రెస్టింగ్గా ప్రజెంట్ చేశారు. సినిమాలో డిఫరెంట్ ప్లేయర్స్ ఉంటాయి. ఈ కథ విన్నప్పుడు నాకు ఇంట్రస్టింగ్ గా అనిపించింది. బిగ్ స్క్రీన్ మీద చూడదగ్గ కథ అనిపించింది.

ప్రీరిలీజ్ ఈవెంట్లో మీరు చాలా ఎమోషనల్ గా మాట్లాడారు.. అలా ఎప్పుడు చెప్పలేదు కదా.. ప్రత్యేకమైన కారణం ఉందా?

ఎప్పుడు అలా చెప్పలేదు కాబట్టి చెప్పాను. ఇండస్ట్రీలో చాలా మందికి తెలుసు. అయితే తెలియని వాళ్ళకి తెలుస్తుందని అలా చెప్పాను. నేను కొన్ని ఈవెంట్స్ కి కొత్తవారిని సపోర్ట్ చేయడానికి వెళుతున్నప్పుడు అక్కడ కూడా నాకు నాకైతే ఈజీగా ఉంటుంది, కొత్త వాళ్లకి ఇండస్ట్రీ బ్యాక్గ్రౌండ్ లేనివారికి కష్టం అన్న కామెంట్స్ వినిపిస్తుంటాయి. నిజానికి ఇక్కడ వాళ్లకి నాకు అందరికీ కష్టమే. ఆ ఉద్దేశంతో అలా చెప్పాను.

జటాధర మీ క్యారెక్టర్ ఎలా వుంటుంది?

ఇందులో ఘోస్ట్ హంటర్ గా కనిపిస్తా. అయితే తనకి దెయ్యాలు వున్నాయంటే నమ్మకం

వుండదు. దేవునిపై నమ్మకం వుంటుంది. సైన్స్‌ని నమ్ముతాను. అలా ఎందుకనేది సినిమాలో చాలా ఆసక్తికరంగా వుంటుంది.

నార్త్ నుంచి తెలుగులోకి తీసుకురావడం ఎలా అనిపించింది?

ఇది తెలుగు సినిమా. కాకపోతే ప్రొడ్యూసర్స్ నార్త్ నుంచి వచ్చారు. తెలుగు సినిమా చేద్దామని వచ్చారు. నాతో, నానితో కలిసి సినిమా చేద్దామని వచ్చారు. ఒక కథ చెప్పారు. నాకు అంతగా నచ్చలేదు. కొన్ని రోజుల తర్వాత మీ దగ్గర ఏదైనా కథ ఉంటే చెప్పమన్నారు. అప్పుడు ఈ కథని మేము డెవలప్ చేస్తున్నాం .అలా చెప్పినప్పుడు వాళ్ళకి నచ్చింది. తర్వాత ప్రొడక్షన్ స్టార్ట్ అయింది.

సోనాక్షితో వవర్క్ చేయడం ఎలా అనిపించింది?

సోనాక్షి చాలా అద్భుతమైన నటి. తన లుక్స్ సౌత్ ఇండియన్ లాగే ఉంటాయి. తన నటన అందరినీ ఆకట్టుకుంటుంది. ధనపిశాచి క్యారెక్టర్ కి చాలా వాల్యు యాడ్ చేశారు.

శిల్పా శిరోద్కర్ గురించి?

శిల్ప శోభ అనే పాత్రలో కనిపిస్తారు. అద్భుతంగా నటించారు. చాలా హెవీ పెర్ఫార్మన్స్ ఉన్న క్యారెక్టర్ అది. సినిమా తర్వాత తనకి చాలా మంచి అవకాశాలు వస్తాయి. తన పర్ఫార్మెన్స్ అవుట్ స్టాండింగ్ ఉంటుంది.

ఇందులో వీఎఫ్ ఎక్స్ వర్క్ ఎలా ఉంటుంది?

ఇది పూర్తిగా విజువల్ ఎఫెక్ట్స్ మీద ఆధారపడిన సినిమా అయితే కాదు. సోనాక్షి సిన్హా ఉండే పోర్షన్లో విఎఫ్ఎక్స్ వర్క్ ఉంటుంది. అది కూడా చాలా అద్భుతంగా వచ్చింది ఆడియన్స్ చాలా నేచురల్ గా ఫీల్ అవుతారు.

మిగతా నటుల గురించి?

అవసరాల శ్రీనివాస్, రాజీవ్ కనకాల, ఝాన్సీ, కిషోర్, ప్రదీప్ రావత్, శిల్పా శిరోద్కర్ ఇలా అందరూ తెలుగులో తెలిసిన నటీనటులే. అందరి క్యారెక్టర్స్ కూడా చాలా కథకి అనుగుణంగా చాలా బాగా వచ్చాయి.

ఇందులో మహేష్ బాబు కనిపిస్తారని టాక్ వినిపిస్తుంది?

లేదండి. నిజానికి ఇందులో శివుడు కనిపించే ఒక ఎపిసోడ్ ఉంది. అక్కడ కృష్ణ గారిని చూపించాలని అనుకున్నాం. కానీ వీఎఫ్ఎక్స్ కి ఎక్కువ సమయం కుదరలేదు. ఇందులో కృష్ణ గారు గాని మహేష్ గాని కనిపించడం వుండదు.

అవుట్ పుట్ చూసుకున్న తర్వాత ఎలా అనిపించింది?

సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఎక్కడ కూడా బోర్ కొట్టదు. నరేషన్ చాలా చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. ఆడియన్స్ చాలా థ్రిల్ అవుతారు.

మీ జర్నీ ఎలా అనిపిస్తుంది?

నా ఫస్ట్ సినిమా ఎస్ఎంఎస్ చేసిన రోజున నేను 20 సినిమాలు చేస్తానని అనుకోలేదు. ఈ జర్నీ నాకు ఆనందాన్ని ఇస్తుంది. నేను ప్రతి సినిమాకి 100% ఇచ్చాను. ప్రతి క్యారెక్టర్ కోసం అహర్నిశలూ కష్టపడతాను. అలా చూసుకుంటే ఐ డిజర్వ్ మచ్ మోర్ అనిపిస్తుంది.

బాలీవుడ్ నుంచి అవకాశాలు వస్తున్నాయా ?

బాఘీ తర్వాత కొన్ని అవకాశాలు వచ్చాయి. అయితే నా ఫోకస్ ఎప్పుడు తెలుగు సినిమా పైనే ఉంది.

నెక్స్ట్ సినిమాలు గురించి?

రాహుల్ రవీంద్రన్ తో ఒక సినిమా వుంది. ఇప్పుడు వరకు అలాంటి కాన్సెప్ట్ వరల్డ్ సినిమాల్లో రాలేదు. కాన్సెప్ట్ పరంగా అది ఒక బాహుబలి లాంటి సినిమా. అలాగే పుల్లెల గోపీచంద్ బయోపిక్ కూడా చేయాలి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200